ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్
మా కలం - సామాన్యుడి బలం
CELL : 9440352036
# స్వర్ణసాగరం
WWW.SWARNASAGARAM.COM
PRGI : APTEL/26/A1104
జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
9440352036

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ
సంపుటి : 1, సంచిక : 159
పేజీలు : 8
గురువారం 20 ఆగస్టు 2026
వెల : 2-00



జెన్ జీపై మోదీ సర్కార్

## ఫోకస్

- ప్రతి రోజూ ఓ యూనివర్సిటీకి ఒక కేంద్ర మంత్రి!
- నీట్ పేపర్ లీక్ నిరసనల నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం
- వన్ డే వన్ యూనివర్సిటీ పేరుతో సరికొత్త మాస్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌కు ప్లాన్
- యువత సవాళ్లు, ఆకాంక్షల్ని నేరుగా తెలుసుకోనున్న మోదీ ప్రభుత్వం

2



## మోదీ ప్రభుత్వం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోంది

- విద్యార్థుల భవిష్యత్తును మోదీ సర్కార్ నాశనం చేసింది
- యువత కోసం కొత్త రోడ్‌మ్యాప్ కావాలి
- మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు

### గ్రూప్-1 పరీక్షలో చరిత్రలో చూడని

# అక్రమాలు



ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లతో జవాబు పత్రాల మూల్యాంకనం

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి అభ్యర్థుల పత్రాలు

84 రోజుల పాటు హాయ్‌లాండ్‌లో పేపర్లు

అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి, స్వర్ణసాగరం

గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్--1 పరీక్షల్లో ఊహకు అందని స్థాయిలో అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించాల్సిన గ్రూప్--1 సర్వీసు అభ్యర్థుల నియామకాల్లోనూ నిబంధనలను ఉల్లంఘించారని, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, ప్లంబర్లు, సెక్యూరిటీ గార్డులు, గృహిణులు, నిరుద్యోగులు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లతో జవాబు పత్రాల మూల్యాంకనం చేయించారని ఆరోపించారు. శాసనసభలో నిబంధన 344 కింద జరిగిన ప్రత్యేక చర్చలో సీఎం ఈ అంశాలను ప్రస్తావించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 315 ప్రకారం ఏర్పడిన ఏపీపీఎస్సీ రాష్ట్రానికి కీలకమైన అధికారులను ఎంపిక చేసే సంస్థ అని, దాని విశ్వసనీయతను దెబ్బతీసేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. 2018లో జారీ చేసిన గ్రూప్--1 నోటిఫికేషన్‌కు 1.14 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 325 మందిని షార్ట్‌లిస్ట్ చేశారని తెలిపారు. పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలను సైతం పోలీసు ఎస్కార్ట్‌తో అత్యంత భద్రత మధ్య తరలిస్తారని, అలాంటిది గ్రూప్--1 పరీక్షా పత్రాల విషయంలో భద్రతా నిబంధనలను పూర్తిగా విస్మరించారని అన్నారు. డిజిటల్ మూల్యాంకనాన్ని పక్కనపెట్టి మాన్యువల్ మూల్యాంకనం చేయాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ కోర్టును తప్పుదోవ పట్టించేలా అఫిడవిట్లు దాఖలు చేశారని ఆరోపించారు. కోర్టు ఆదేశాల తర్వాత కూడా హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం కోసం రూ.1.19 కోట్ల విలువైన పనులకు - మిగతా3లో

## మేయర్, మున్సిపల్ చైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నిక

- అసెంబ్లీలో బిల్లు ఆమోదం
- ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్ట సవరణ సందర్భంగా జరిగిన చర్చలో తెలుగు ప్రాధాన్యంపై పలువురు ఎమ్మెల్యేల ఆవేదన
- మాతృభాషకు ప్రాధాన్యం ఇస్తున్నామని లోకేశ్ వివరణ
- ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు 50 ఎకరాల భూమి ఉండాలన్న నిబంధనను సడలించినట్లు వెల్లడి
- రాష్ట్రంలో అవయవాల దానం ప్రోత్సహించేందుకు దగ్గర బంధువుల నుంచి అవయవ మార్పిడి కోసం అనుమతులు ఇచ్చేందుకు వీలుగా చట్ట సవరణలు



అమరావతి, స్వర్ణసాగరం

రాష్ట్రంలో 3 చట్ట సవరణ బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్ట సవరణ సందర్భంగా జరిగిన చర్చలో తెలుగు ప్రాధాన్యంపై పలువురు ఎమ్మెల్యేలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తగిన ప్రాధాన్యం ఇచ్చే విధంగా ప్రభుత్వ చర్యలు ఉండాలని వారు కోరారు. దీనిపై మంత్రి లోకేశ్ సమాధానం చెబుతూ ఈ అంశాలను కచ్చితంగా పరిగణనలోకి తీసుకొని తాము మాతృభాషకు ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు 50 ఎకరాల భూమి ఉండాలన్న - మిగతా3లో



## 2027 ఎన్నికలే లక్ష్యం

- బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!
- 2027 యూపీ ఎన్నికలే లక్ష్యంగా బీఎస్పీ వ్యూహరచన
- గతంలో అధికారం తెచ్చిపెట్టిన దళిత-బ్రాహ్మణ ఫార్ములాపై ఫోకస్
- కీలక నేత సతీశ్ చంద్ర మిశ్రాకు పెరిగిన బాధ్యతలు
- ఇటీవలి ఎన్నికల్లో ఘోర పరాభవం నుంచి కోలుకునే ప్రయత్నం

2

## మరో ఏడాదిలో

# పాదయాత్ర



- పాదయాత్రపై వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా మనదే విజయం
- నిత్యం ప్రజలతో మమేకపై పని చేయండి
- కూటమి కుట్రలను ఎదుర్కొంటూ యుద్ధం చేయాలి
- "రాష్ట్రంలో దారుణంగా దిగజారిన శాంతి భద్రతలు
- ఇసుక, మట్టి, మద్యం మాఫియాలు.
- ఆ ఘటన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారు.
- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అమరావతి, స్వర్ణసాగరం

రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో బుధవారం వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమావేశమయ్యారు. నియోజకవర్గ ఇంఛార్జి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాదయాత్రపై వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. "మరో ఏడాదిలో నా పాదయాత్ర మొదలవుతుంది. ఆ తర్వాత ఏడాది ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మనదే విజయం. నిత్యం ప్రజలతో - మిగతా3లో

## సరుకు రవాణాకు భారీ ఊతం

- రూ.9,450 కోట్లతో 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్
- బంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో 410 కి.మీ. మేర అదనపు రైల్వే లైన్లు

2

## త్వరలో 100 పురపాలక

# సంఘాలకు ఎన్నికలు

- బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న కూటమి ప్రభుత్వం
- రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల జరగనున్న ఎన్నికలు
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి

అమరావతి, స్వర్ణసాగరం

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లను యథాతథంగా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎ. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పురపాలక - మిగతా3లో



# జెన్ జీపై మోదీ సర్కార్ ఫోకస్

దేశంలోని యువతీయువకులను (జెన్ జీ)ని ఆకట్టుకునేందుకు, వారికి మరింత దగ్గరయ్యేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా దేశంలోని యూనివర్సిటీలకు ప్రతి రోజూ ఒక కేంద్ర మంత్రిని పంపించాలని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం యోచిస్తోంది. 'వన్ డే, వన్ యూనివర్సిటీ' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులతో మంత్రులు నేరుగా మాట్లాడి, వారి అభిప్రాయాలు, సమస్యలు, దేశానికి సంబంధించిన వివిధ అంశాలపై వారి ఆలోచనలను తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా కేవలం ప్రభుత్వ పథకాల్ని ప్రచారం చేయడం మాత్రమే కాకుండా, యువత ఏమనుకుంటున్నారు?, వారి ప్రధాన సమస్యలు ఏంటి? దేశంలో జరుగుతున్న పరిణామాలపై వారి అభిప్రాయాలు ఎలా ఉన్నాయి? వంటి అంశాల్ని తెలుసుకోవడంపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. విద్యార్థులకు ముఖ్యంగా యువత కోసం అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవకాశాల్ని కూడా కేంద్ర మంత్రులు వివరించనున్నారు. విద్యార్థుల కోపాన్ని తగ్గించి, వారితో నేరుగా మాట్లాడేందుకే ఈ కొత్త ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంపై చర్చ జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల దేశవ్యాప్తంగా నీట్ సహా ఇతర ప్రధాన ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం కలకలం రేపింది. తర్వాత దిల్లీలోని జంతర్ మంతర్ సహా అనేక ప్రాంతాల్లో విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా జులై 20న ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్ తీవ్ర విమర్శలకు దారితీసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కూడా ప్రతిపక్షాలు ఈ అంశంపై నిరసనలు తెలిపాయి. ఈ వివాదాల నడుమ జులై 25న ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే యువతలో నెలకొన్న అసంతృప్తిని తొలగించి, వారిలో నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.



ఇంకా ఈ వన్ డే వన్ యూనివర్సిటీ ఇనిషియేటివ్‌ను సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇద్దరు మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ- విశ్వవిద్యాలయాలు, ఇతర కేంద్ర మంత్రుల్ని సమన్వయం చేయనున్నారు. కేటాయించిన రోజున ఒక కేంద్ర మంత్రి వర్సిటీకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడతారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (ఖ+జ) లెక్కల ప్రకారం దేశంలో 57 కేంద్ర విశ్వవిద్యాలయాలు, 522 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు సహా మొత్తం 1300 కంటే ఎక్కువ యూనివర్సిటీలు ఉన్నాయి.

### యువతరంవైపే ప్రధాని దృష్టి

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల యువతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. నిరసనల సమయంలో విద్యార్థులు, యువతను ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా పలుమార్లు సందేశాలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనూ యువత కోసం పలు కొత్త కార్యక్రమాల్ని ప్రకటించారు. ఉచిత ఆన్‌లైన్ కోచింగ్, ఏఐ స్కిల్లింగ్ ప్రోగ్రామ్, క్రీడల్లో యువత ప్రతిభను గుర్తించే కార్యక్రమం వంటి అంశాల్ని ప్రస్తావించారు.

### కేంద్ర మంత్రుల సోషల్ మీడియా పనితీరుపైనా సమీక్ష

ఇదే సమయంలో యువత, జెన్‌జీకి మరింత చేరువయ్యేందుకు సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకోవాలని కేంద్ర మంత్రులకు ప్రభుత్వం సూచించింది. ప్రధాని అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో కేంద్ర మంత్రుల సోషల్ మీడియా పనితీరు, వారి పోస్టులకు వస్తున్న రీచ్‌పై చర్చ జరిగినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ రీచ్ ర్యాంకింగ్స్‌లో మోదీ అగ్రస్థానంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంత్రుల సోషల్ మీడియా పోస్టులు ఎంత మందికి చేరుతున్నాయి, వాటి ద్వారా ఏ మేర ప్రజల్ని చేరుకోగలుగుతున్నారనే అంశాలపై సమావేశంలో సమీక్ష జరిగినట్లు సమాచారం. యువతకు ప్రభుత్వ సందేశాలు మరింత విస్తృతంగా చేరేలా మంత్రులు తమ సోషల్ మీడియా రీచ్ పెంచుకోవాలని కూడా సూచించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# మోదీ ప్రభుత్వం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోంది

విద్యార్థులు, యువత భవిష్యత్తును గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేలా కాంగ్రెస్ సమగ్ర 'ఎడ్యుకేషన్ టు ఎంప్లాయ్‌మెంట్ రోడ్‌మ్యాప్' రూపొందించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. దిల్లీలని ఇందిరా భవన్?లో బుధవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం ప్రారంభ ప్రసంగం సందర్భంగా ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశంలో కొత్త పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉంది. అవి కాకపోగా, ఇటీవల సంవత్సరాల్లో సుమారు 94వేల పాఠశాలలు మూతపడ్డాయి. యువత భవిష్యత్తును మెరుగుపరిచే విధానాల స్థానంలో విద్యా రంగంలో ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రైవేటీకరణ పెరగడంతో ఉన్నత విద్య ఖరీదైనదిగా మారుతోంది. సాధారణ కుటుంబాలకు ఉన్నత విద్య అందుబాటులో లేకుండా పోతోంది. విద్యా సంస్థల్లో ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తుల ప్రాబల్యం పెరుగుతోంది. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో సంస్థల స్వరూపాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని ఖర్గే అన్నారు.

### 'పేపర్ లీకులు నియామకాల జాప్యం'

చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ప్రయత్నించే యువతకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని ఖర్గే పేర్కొన్నారు. పేపర్ లీకులు, నియామక పరీక్షల్లో అక్రమాలు, ఉద్యోగ నియామకాల్లో జాప్యం కారణంగా నిరుద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా పేద, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులే ఈ పరిణామాలతో ఎక్కువగా నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. యువతలో దేశవ్యాప్తంగా కనిపిస్తున్న ఆగ్రహం ఒక్కరోజులో పుట్టింది కాదని అన్నారు. వారి సమస్యలను వినడానికి ప్రభుత్వం ఎప్పుడూ తగినంత సమయం కేటాయించలేదని, సమస్యలను పరిష్కరించడానికి బదులుగా తాత్కాలిక చర్యలతో వాటిని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించిందని



విమర్శించారు. దీంతో యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. యువత సమస్యలను కాంగ్రెస్ తన రాజకీయ అజెండాలో చేర్చిందని ఖర్గే తెలిపారు. రాహుల్ గాంధీ ఛత్రోన్ కీ గూంజ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లోనూ విద్య, పరీక్షలకు సంబంధించిన సమస్యలపై సమగ్ర చర్చ జరగాలని కాంగ్రెస్ కోరిందన్నారు.

### రామాలయ విరాళాల అంశంపైనా ప్రశ్నలు

ఈ సందర్భంగా అయోధ్య రామాలయానికి సంబంధించిన విరాళాలపై వచ్చిన ఆరోపణలను కూడా ఖర్గే ప్రస్తావించారు. విరాళాల నిధుల దుర్వినియోగం లేదా చోరీ జరిగిందన్న ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రధాని ప్రజలకు సమాధానం చెప్పాలని, క్షమాపణ చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఆర్థిక అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### చైనా చొరబాట్లపైనా ప్రశ్నలు

భారత్-చైనా సరిహద్దుల్లో చైనా చొరబాట్లకు సంబంధించిన వార్తలపైనా ఖర్గే స్పందించారు. జాతీయ భద్రతను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించకూడదని అన్నారు. అదే సమయంలో సరిహద్దుల పరిస్థితిపై ప్రజలు ప్రశ్నలు అడగకుండా జాతీయ భద్రత పేరుతో అడ్డుకోవడం కూడా సరికాదని వ్యాఖ్యానించారు. భారత సాయుధ దళాలపై తమకు అత్యంత గౌరవం ఉందని, అయితే సరిహద్దుల్లో వాస్తవ పరిస్థితి, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రజలకు పారదర్శకంగా సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.

### రాజీవ్ గాంధీని గుర్తుచేసుకున్న ఖర్గే

స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తవుతున్నప్పటికీ కీలక రంగాల్లో పరిస్థితులు మెరుగుపడటానికి బదులుగా దిగజారు తున్నాయని ఖర్గే వ్యాఖ్యానించారు. మతపరమైన ఉద్రిక్తతలు, రేవడి సంస్కృతి రాజకీయాల మధ్య విద్య, ఉపాధి అంశాలు తీవ్రంగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకున్న ఖర్గే, భారీ మెజారిటీతో ప్రభుత్వం నడిపినప్పటికీ రాజీవ్ గాంధీ యువతను తన విధానాల కేంద్రంగా ఉంచారని అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత అందుబాటు ధరల్లో విద్యను విస్తరించేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలే పేదలు, అణగారిన వర్గాలకు సామాజిక, ఆర్థిక పురోగతికి మార్గం చూపాయని పేర్కొన్నారు.

### కీలక నేతల హాజరు

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి ఖర్గే అధ్యక్షత వహించారు. మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ సహా పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. సీనియర్ నాయకులు అంబికా సోని, ముకుల్ వాస్నిక్, పీ చిదంబరం తదితర అగ్రనేతలు కూడా పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

# ఏకంగా 600 మంది ఉద్యోగుల తొలగింపు

**న్యూఢిల్లీ :** ఔం డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ సంస్థలో తీసుకున్న చర్యలను మంత్రిత్వశాఖకు వివరించారు. పరీక్షల బృందాన్ని పూర్తిగా పునర్వ్యవస్థీకరించే చర్యల్లో భాగంగా సుమారు 600 మంది నిపుణులను తొలగించి, వారి స్థానంలో కొత్త నిపుణులను నియమించనున్నారు. ప్రశ్నపత్రాల్లో పొరపాట్లు, లోపాలు లేకుండా చూసేందుకు నాలుగు అంచెల తనిఖీ వ్యవస్థను తీసుకురానున్నారు. ఔంలో వచ్చే రెండు నుంచి మూడు వారాల్లో మరో 20-25 మంది అధికారులను నియమించనున్నట్లు విద్యాశాఖ తెలిపింది. భవిష్యత్‌లో మరిన్ని నియామకాలు చేపట్టే ప్రణాళికపైనా సమీక్ష నిర్వహించినట్లు పేర్కొంది. అంతేకాకుండా ఔం కార్యాలయాలను కొత్త భవనాలకు యుద్ధప్రాతిపదికన తరలించనున్నారు. కార్యాలయాల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బందిని మోహరించనున్నారు. ప్రశ్నపత్రం లీకేజీ వివాదం, ఇటీవల యూజీసీ నెట్ పరీక్షల్లో తలెత్తిన సమస్యలపై కేంద్ర విద్యాశాఖ తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తడంతో ఔంలో సంస్కరణలకు ప్రభుత్వం చర్యలు



చేపట్టింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో పరీక్షల నిర్వహణకు అవసరమైన భద్రతా, మౌలిక సదుపాయాలను పటిష్టం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల నెట్ జూన్ 2026 పరీక్షలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టుల్లో పరీక్షలను మళ్లీ నిర్వహించాలని ఔం ప్రకటించింది. ఈ మూడు ప్రశ్నపత్రాల్లో వాస్తవపరమైన తప్పులు, టైపింగ్ పొరపాట్లు, అనువాద లోపాలు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు నిపుణుల కమిటీ గుర్తించింది. దీంతో అవి న్యాయమైన, లోపరహిత పరీక్ష ప్రమాణాలకు అనుగుణంగా లేవని కమిటీ తేల్చింది. పరీక్షల నిర్వహణలో లోపాలపై చర్యల్లో భాగంగా జూలైలోనే 47 మంది ఔం అధికారుల సేవలను ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా మరో 600 మంది నిపుణులను తొలగించి కొత్త వారిని నియమించే ప్రక్రియ చేపట్టడంతో భారీ స్థాయిలో ప్రక్షాళన జరుగుతోంది. పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక చర్య చేపట్టింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అన్యాయ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు-2026ను పార్లమెంట్ ఇటీవల ముగిసిన వర్షాకాల సమావేశాల్లో ఆమోదించింది. పేపర్ లీకేజీ కేసుల్లో కఠిన శిక్షలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, నిర్ణీత గడువులో విచారణ వంటి నిబంధనలను ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. పేపర్ లీకేజీ, నిరసన చేస్తున్న విద్యార్థులపై జూలై 20న జరిగిన పోలీసు చర్యల నేపథ్యంలో పార్లమెంట్ ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం నెలకొన్న తర్వాత ఈ బిల్లుకు ఆమోదం లభించింది. మొత్తంగా ఔంలో చేపడుతున్న తాజా సంస్కరణలు పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత, ప్రశ్నపత్రాల నాణ్యతను పెంచడమే లక్ష్యంగా సాగుతున్నాయి.

## సరుకు రవాణాకు భారీ ఊతం

దేశంలో రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ, రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటి మొత్తం అంచనా వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. అదే సమయంలో బిహార్‌లోని ముజఫర్‌పూర్-సీతామఢి-సోన్బర్సా మార్గాన్ని నాలుగు లేన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేసేందుకు మరో రూ.3,590.73 కోట్ల ప్రాజెక్టుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొత్తగా ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టులతో భారత రైల్వే నెట్‌వర్క్‌లో సుమారు 410 కిలోమీటర్ల మేర అదనపు లైన్లు అందుబాటులోకి రానున్నాయి. 2030-31 నాటికి ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బంగాల్? ఖరగ్‌పూర్ నుంచి ఒడిశాలోని భద్రక్ (రాణీతాల్) వరకు 173 కి.మీ. మేర నాలుగో లైన్ నిర్మించనున్నారు. భద్రక్-హరిదాస్‌పూర్ మధ్య 75 కి.మీ. మేర మరో నాలుగో లైన్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గుమ్మిడిపూండి నుంచి తమిళనాడులోని గూడూరు వరకు 90 కి.మీ. మేర మూడో, నాలుగో లైన్లను నిర్మించనున్నారు. ఒడిశాలోని కటక్ నుంచి పరదీప్ (బడబంధ) వరకు 72 కి.మీ. మేర మూడో, నాలుగో లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ నాలుగు ప్రాజెక్టులు బంగాల్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలను కవర్ చేయనున్నాయి. సుమారు 6,448 గ్రామాలకు రైలు కనెక్టివిటీ మెరుగుపడనుంది. దాదాపు 60 లక్షల మంది ప్రజలు ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రయోజనం పొందుతారని కేంద్రం తెలిపింది.

### సరుకు రవాణాకు భారీ ఊతం

ఈ మార్గాలు బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఇనుము-ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైల్స్, ఆహార ధాన్యాల వంటి సరుకుల రవాణాకు కీలకమైనవి. లైన్ల విస్తరణతో ఏటా 76 మిలియన్ టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కేంద్రం అంచనా వేసింది. పర్యాటక రంగానికీ ఈ ప్రాజెక్టులు ఉపయోగపడనున్నాయి. కుల్డిహా వన్యప్రాణి అభయారణ్యం, భితర్‌కణిక జాతీయ ఉద్యానవనం, చంద్రభాగ, తలసరి-ఉదయ్‌పూర్, చాందీపూర్ బీచ్, పులికాట్ సరస్సు, నెలపట్టు పక్షుల అభయారణ్యం, లలిత్‌గిరి తదితర పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు కనెక్టివిటీ మెరుగుపడనుంది. రైల్వే పర్యావరణహిత, ఇంధన సామర్థ్యం కలిగిన రవాణా మార్గమని కేంద్రం తెలిపింది. ఈ ప్రాజెక్టుల వల్ల ఏటా సుమారు 13 కోట్ల లీటర్ల చమురు దిగుమతి తగ్గడంతో పాటు 65 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని అంచనా వేసింది. ఇది సుమారు 2.60 కోట్ల చెట్లను నాటినంత ప్రయోజనంతో సమానమని పేర్కొంది.

### బిహార్‌లో ఎన్‌హెచ్-22 విస్తరణ

ఇక బిహార్‌లో ముజఫర్‌పూర్-సీతామఢి-సోన్బర్సా మధ్య 82.578 కి.మీ. పొడవైన ఎన్‌హెచ్-22ను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్?ఏఎం)లో చేపట్టే ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3,590.73 కోట్లు. ఈ రహదారి భారత్-నేపాల్ సరిహద్దులోని సోన్బర్సాను ముజఫర్‌పూర్‌లోని ఎన్‌హెచ్-27తో అనుసంధానించనుంది. దీంతో ముజఫర్‌పూర్, బరౌనీ వంటి ఆర్థిక కేంద్రాలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు గంగానది పరివాహక ప్రాంతంలోని సరుకు రవాణా కేంద్రాలకు అనుసంధానం బలోపేతం కానుంది. నేపాల్ సరిహద్దులోని భిఠామోర్ ల్యాండ్ పోర్టు ద్వారా ప్రయాణికులు, సరుకుల రాకపోకలకు కూడా ఈ రహదారి కీలకం కానుంది.

### ఏడు వంతెనలు- మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు

ప్రాజెక్టులో ఏడు ప్రధాన వంతెనలు, మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో బాగ్మతీ నదిపై 340 మీటర్ల పొడవైన ప్రధాన వంతెన కూడా ఉంది. ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు 1,170 మీటర్లు, 270 మీటర్ల పొడవైన రెండు ఫ్లైఓవర్లు నిర్మించనున్నారు. ముజఫర్‌పూర్, ముక్సుద్‌పూర్, రున్నీ సైద్‌పూర్, తుమ్మా, డుమ్రా, భూతాహీ, సోన్బర్సా వంటి జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి.. సురక్షితమైన, వేగవంతమైన రాకపోకలకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని కేంద్రం తెలిపింది.

## పీఎం కేర్స్ నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేయాలి

పీఎం కేర్స్ నిధులపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు పీఎం కేర్స్ ఫండ్‌లోని నిధులను వినియోగించాలని డిమాండ్ చేశారు. తాను నిజంగానే కేర్ తీసుకుంటున్నానని ప్రధాని నరేంద్ర మోదీ నిరూపించుకోవాలని అన్నారు. పాఠశాలలకు వెళ్లేందుకు సరైన రోడ్లు, తరగతి గదుల్లో బెంచీలు, తాగునీరు వంటి కనీస సదుపాయాల కోసం దేశంలోని పిల్లలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పీఎం కేర్స్ ఫండ్‌లో వేల కోట్ల రూపాయలు ఉన్నప్పుడు వాటిని పాఠశాలల అభివృద్ధికి ఎందుకు ఉపయోగించకూడదని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. 'తాజా ఆడిట్ నివేదిక ప్రకారం, 2025 మార్చి 31 నాటికి పీఎం కేర్స్ ఫండ్? మొత్తం నిల్వ రూ.8,452 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.7,173 కోట్లుగా ఉంది. పాఠశాలలకు వెళ్లేందుకు సరైన రోడ్లు, తరగతి గదుల్లో బెంచీలు, తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పాఠశాలల కోసం ఈ నిధులను ఎందుకు ఉపయోగించడం లేదు? ఒక మంచి మౌలిక వసతులతో కూడిన మోడల్ స్కూల్ నిర్మాణానికి సుమారు రూ.8 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తే, రూ.8,500 కోట్లతో వెయ్యికి పైగా హైటెక్ పాఠశాలలను నిర్మించే అవకాశం ఉంది. కానీ అలా జరగడం లేదు. ఇటువంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు' అని దీప్కే ప్రశ్నించారు.

### గ్రామీణ పాఠశాలల్లో దుస్థితి

మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల తాను సందర్శించిన పాఠశాలల్లో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని దీప్కే ఆరోపించారు. కనీస సౌకర్యాలు ఎందుకు లేవని అధికారులను ప్రశ్నించగా, నిధుల కొరత ఉందని సమాధానం ఇచ్చారని తెలిపారు. ఒకవైపు పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు నిధులు లేవని అధికారులు చెబుతుండగా, మరోవైపు పీఎం కేర్స్ ఫండ్‌లో వేల కోట్ల రూపాయలు ఉన్నాయని ఆయన అన్నారు. ఆ నిధులను పిల్లల విద్య కోసం ఉపయోగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మరో పోస్ట్?లో గ్రామీణ పాఠశాలల దుస్థితిని చూపించేలా మురికిగా ఉన్న మరుగుదొడ్డి, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం ఫొటోలను కూడా దీప్కే సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. పీఎం కేర్స్ నిధులను మంచి పనికి ఉపయోగించవచ్చు అంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీఎం కేర్స్ నిధులను ప్రజల కోసం, ముఖ్యంగా పేద పిల్లల విద్య, పాఠశాలల అభివృద్ధి కోసం ఉపయోగించాలని దీప్కే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. పిల్లలు మంచి పాఠశాలలు, మెరుగైన సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని, అందుబాటులో ఉన్న నిధులను వారి భవిష్యత్తు కోసం వినియోగించాలని అన్నారు. ప్రధాని నిజంగా పిల్లల గురించి పట్టించుకుంటున్నారని చూపించాలని వ్యాఖ్యానించారు. తాజా ఆడిట్ నివేదిక ప్రకారం, పీఎం కేర్స్ ఫండ్‌లోని మొత్తం రూ.8,452 కోట్లలో సుమారు రూ.7,846 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉన్నాయని, మరో రూ.605 కోట్లు సేవింగ్స్ బ్యాంక్ ఖాతాల్లో ఉన్నాయని వెల్లడైంది.

## 2027 ఎన్నికలే లక్ష్యం..

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన "దళిత-బ్రాహ్మణ" సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు.

ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్ చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధించిన లీగల్, మీడియా విభాగాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. అలాగే, కేంద్రం ఎన్నికల సంఘానికి సంబంధించిన వ్యవహారాలను సైతం ఆయనే పర్యవేక్షిస్తారని మాయావతి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు.

# త్వరలో 100 పురపాలక సంఘాలకు ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి

శాఖ కమిషనర్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం, రాష్ట్రంలోని మొత్తం 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఐదేళ్ల పదవీకాలం ముగిసిన 87 పురపాలక సంఘాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది నవంబర్ నాటికి పదవీకాలం పూర్తి చేసుకోనున్న మరో 13 చోట్ల ఎన్నికలు జరగనున్నాయి. న్యాయపరమైన సమస్యల కారణంగా 23 పురపాలక సంఘాల్లో ఎన్నికలు సాధ్యపడవని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని, వెనుకబడిన తరగతులకు మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఓటర్ల జాబితా తయారీ, వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

**త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం**

రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం మొదలుకానుంది. ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. అందులో భాగంగా నేడు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించింది. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్లతో ముందస్తు సమీక్ష చేశామని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఒక్కో ప్రక్రియ పూర్తి చేసుకుంటూ వెళ్తున్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో పలు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే సంబంధిత శాఖల కమిషనర్లకు సమాచారం ఇచ్చామని ప్రోటోకాల్ ప్రకారం ఏయే కార్యక్రమాలు చేయాలి అన్న దానిపై సమీక్షించినట్లు పునేఠా తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష జరిపినట్లు పునేఠా వివరించారు. ఓటర్ల జాబితా ప్రదర్శన ఆగస్టు 17తో పూర్తైందని చెప్పారు.

**పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు గ్రీన్‌సిగ్నల్**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే 87 పుర, నగరపాలికలతో పాటు 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు స్పష్టం చేశాయి. ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు రెండు శాఖలు వేర్వేరుగా నివేదికలు సమర్పించాయి. డివిజన్లు, వార్డుల పునర్విభజనపై కోర్టులో ఉన్న కేసులు పరిష్కారమైతే 87 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో




ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది. కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన 20 రోజుల్లోనే వంద చోట్లా పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించింది.

**మార్చితోనే పాలకవర్గాల పదవీకాలం పూర్తి**

2021లో ఎన్నికలు జరిగిన 100 పుర, నగరపాలక సంస్థల్లో 87 చోట్ల ఈ ఏడాది మార్చితోనే పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. మరో 13 చోట్ల నవంబరు 22తో ముగియనుంది. సమీప గ్రామ పంచాయతీలను విలీనం చేసే చట్టం-5పై దాఖలైన పిటిషన్లతో గతంలో 23 చోట్ల ఎన్నికలు నిలిచిపోయాయి. అయితే వీటిలో మంగళగిరి-తాడేపల్లి, శ్రీకాళహస్తి, కావలి, అల్లూరుకి సంబంధించిన కేసులు ఇటీవల ఉపసంహరించుకున్నట్లు సమాచారం. మిగిలిన కేసుల పరిష్కారంపైనా వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు పురపాలక శాఖ ఎస్ఈసీకి నివేదించింది.

**పంచాయతీరాజ్ శాఖ గ్రీన్ సిగ్నల్**

రాష్ట్రవ్యాప్తంగా 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోర్టు కేసులు, ఇతర కారణాలతో దాదాపు వంద పంచాయతీల్లో మినహా, మిగిలిన చోట్ల ఎన్నికలు నిర్వహించవచ్చని ఎస్ఈసీకి స్పష్టం చేసింది. దీనికోసం ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాలు ప్రచురించి, ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు నివేదికలో వివరించింది. 2021 ఎన్నికల సమయంలో విలీనం వివాదాలతో హైకోర్టులో కేసులు దాఖలు కావడంతో అప్పట్లో 354 పంచాయతీల్లో ఎన్నికలు ఆగిపోయాయి. వాటిలో కొన్ని కేసులు ఇప్పటికే పరిష్కారం కాగా, మరికొన్ని ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖ తెలిపింది. ఏదిఏమైనా న్యాయపరమైన చిక్కులు తొలిగితే రాష్ట్రంలో అతి త్వరలోనే స్థానిక సమరం ఖాయంగా కనిపిస్తోంది.

**వెంటనే షెడ్యూల్ విడుదల**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. ప్రభుత్వ శాఖల సన్నద్ధతపై నివేదికలు అందడంతో, కోర్టు కేసుల అడ్డంకులు తొలగిన వెంటనే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది.

# మరో ఏడాదిలో పాదయాత్ర

-మొదటిపేజీ తరువాయి

మమేకమై పని చేయండి" అంటూ వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచారని ఆయన దుయ్యబట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ నిలబెట్టుకోలేదు. విద్యార్థులు, రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, ఉద్యోగులు, వ్యాపారులు.. ఇలా ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదు. అందుకే వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం మీద రెండేళ్లలోనే తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అదే సమయంలో మన వైయస్సార్‌సీపీపై రోజురోజుకీ ప్రజాదరణ పెరుగుతోంది. అందుకే నాటి గత మన ఐదేళ్ల పరిపాలనను, ఇప్పుడు వెన్నుపోటు పార్టీ కూటమి పాలనతో పోల్చి చూస్తున్నారు. దీనిపై ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది" అని వైఎస్ జగన్ వివరించారు.

**కూటమి కుట్రలను ఎదుర్కొంటూ యుద్ధం చేయాలి**

స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు సిద్ధం కావాలని.. గెలుపే లక్ష్యంగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన.. రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఇంఛార్జి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఏ ఒక్క వర్గమూ కూడా సంతోషంగా లేదన్నారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకత స్థానిక ఎన్నికల్లో కనబడకుండా చేసేందుకు పోలీసులను ప్రయోగిస్తారు. అన్నీ ఎదుర్కొని యుద్ధం చేయాలి. మనకు అత్యంత ప్రజాదరణ ఉంది. అందుకే తప్పకుండా గెలుస్తాం" అని వైఎస్ జగన్ తేల్చి చెప్పారు. "రాష్ట్రంలో దారుణంగా దిగజారిన శాంతి భద్రతలు. ఇసుక, మట్టి, మద్యం మాఫియాలు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన పోలీసులు. ఆ స్థాయికి దిగజారిన వ్యవస్థలు. ఆ ఘటన నుంచి ప్రజల దృష్టి మళ్ళించేందుకు కుట్రలు చేస్తున్నారు. రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంకను దారుణంగా చంపారు. కారుతో పదే పదే ఢీకొట్టి ప్రాణం తీశారు. అయినా కేసు బయటకు రాకుండా తొక్కి పెట్టే ప్రయత్నం చేశారు. అంత దారుణంగా పోలీసులు, అధికార పార్టీ వారు కుమ్మక్కై పని చేస్తున్నారు" అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాష్ట్ర ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచిన వెన్నుపోటు పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ నిలబెట్టుకోలేదు. విద్యార్థులు, రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, ఉద్యోగులు, వ్యాపారులు.. ఇలా ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదు. అందుకే వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం మీద రెండేళ్లలోనే తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అదే సమయంలో మన వైఎస్సార్‌సీపీపై రోజురోజుకీ ప్రజాదరణ పెరుగుతోంది. ..అందుకే నాటి గత మన ఐదేళ్ల పరిపాలనను, ఇప్పుడు వెన్నుపోటు పార్టీ కూటమి పాలనతో పోల్చి చూస్తున్నారు. దీనిపై ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది. మరో ఏడాదిలో నా పాదయాత్ర మొదలవుతుంది. ఆ తర్వాత ఏడాది ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మనదే విజయం. నిత్యం ప్రజలతో మమేకమై పని చేయండి" అంటూ వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.

## క్షేత్రస్థాయి కేడర్‌లపై జగన్ గురి

విజయవాడ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయంగా మరోసారి ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాన్ని వేగవంతం చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత కొంతకాలం పార్టీ కార్యాలయానికే పరిమితమైన ఆయన ఇటీవల వరుస పర్యటనలు చేపడుతున్నారు. ఈ పర్యటనలు కేవలం పార్టీ నేతలను పరామర్శించేందుకే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల పరిస్థితిని అర్థం చేసుకునేందుకు కూడా ఉపయోగపడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.జగన్‌కు దాదాపు రెండు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. ఈ కాలంలో ఎదురైన విజయాలు, పరాజయాల నుంచి ఆయన ఎన్నో విషయాలు నేర్చుకున్నారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల స్పందనను అంచనా వేయడంలో జగన్‌కు మంచి అవగాహన ఉందనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో ఉంది. గత ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఫలితాలకు కేవలం ప్రభుత్వ వ్యతిరేకత మాత్రమే కారణం కాదని, సంస్థాగతంగా జరిగిన లోపాలు కూడా కీలక పాత్ర పోషించాయని వైసీపీ నాయకత్వం గుర్తించినట్లు తెలుస్తోంది.ఎన్నికల అనంతరం పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం కనిపించింది. పలువురు నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా క్రియాశీలత తగ్గించుకోవడంతో క్షేత్రస్థాయిలో వైసీపీ బలహీనపడిందనే భావన ఏర్పడింది. ఈ నేపథ్యంలో జగన్ స్వయంగా ప్రజల్లోకి రావడం పార్టీ క్యాడర్‌కు కొత్త ధైర్యాన్ని ఇచ్చిందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.ఇటీవల గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర, కర్నూలు ప్రాంతాల్లో జగన్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం పార్టీ నాయకుల్లో ఆసక్తిని పెంచింది. ఈ స్పందనను వైసీపీ నాయకత్వం రాజకీయంగా అనుకూల సంకేతంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో పార్టీకి పూర్తిగా ఆదరణ తగ్గిపోలేదని, సరైన కార్యక్రమాలతో తిరిగి బలపడే అవకాశం ఉందనే నమ్మకం కార్యకర్తల్లో ఏర్పడుతోందని సమాచారంఅయితే కేవలం జనసమీకరణతోనే రాజకీయ విజయాన్ని సాధించడం సాధ్యం కాదనే విషయం కూడా వైసీపీకి తెలుసని పరిశీలకులు అంటున్నారు. గతంలో జరిగిన సంస్థాగత లోపాలను సరిదిద్దడం, నియోజకవర్గ స్థాయిలో నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తలను మళ్లీ చురుగ్గా పనిచేసేలా చేయడం కీలకంగా మారనుంది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు పార్టీకి స్పష్టమైన కార్యాచరణ అవసరం.ఇదే సమయంలో జగన్ పర్యటనలు కూటమి పార్టీల్లో కూడా రాజకీయ చర్చకు కారణమవుతున్నాయని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న దశలో ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజల్లో చురుగ్గా తిరగడం రాబోయే రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి.మొత్తంగా చూస్తే జగన్ పర్యటనలు వైసీపీకి రాజకీయంగా మళ్లీ చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. ఇకపై కూడా ఇదే దూకుడును కొనసాగిస్తూ జిల్లాల వారీగా పర్యటనలు నిర్వహించాలని పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ పార్టీని పునర్నిర్మించడమే లక్ష్యంగా జగన్ ముందుకు సాగితే, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరిన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది

**మండలిలో..**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలి రోజే ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ అనుసరించిన వ్యూహాత్మక వైఖరి రాజకీయంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజా సమస్యలపై పోరాడేందుకు దక్కిన అత్యున్నత రాజ్యాంగ వేదికైన శాసనసభను బహిష్కరించి, కేవలం శాసనమండలిలో డీఎస్సీపై వాయిదా తీర్మానం ఇవ్వడం ద్వారా ఆ పార్టీ తన బలహీనతను తానే బయటపెట్టుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీలో ప్రజాప్రతినిధులుగా గొంతు విప్పాల్సిన 11 మంది ఎమ్మెల్యేలు సభకు రాకుండా ముఖం చాటేయడం పార్టీ ప్రజాస్వామిక విశ్వసనీయతను ప్రజల్లో తీవ్రంగా దెబ్బతీస్తోంది.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి గణాంకాలతో ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతూ.. అసెంబ్లీకి వచ్చి డీఎస్సీ సహా ఏ అంశంపైనైనా చర్చించాలని పదేపదే విసిరిన సవాల్‌కు వైఎస్సార్‌సీపీ నుంచి అత్యంత పేలవమైన స్పందన వచ్చింది. సభలో ఉన్న ప్రజాప్రతినిధులెవరూ ఆ సవాల్‌ను స్వీకరించే సాహసం చేయకపోగా, సభకు వచ్చే అర్హతే లేని మాజీ మంత్రి పేర్ని నాని బయట మీడియా ముందుకొచ్చి తాను చర్చకు వస్తానని ప్రకటించడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది. ఎన్నికైన 11 మంది ఎమ్మెల్యేలలో ఏ ఒక్కరూ లోకేష్ సవాల్‌ను ఎదుర్కొనేందుకు ముందుకు రాకపోవడం పార్టీలోని నాయకత్వ లోపాన్ని స్పష్టం చేస్తోంది.ప్రజా సమస్యలపై సభలో నిలదీయకుండా గురువారం నాటి ప్రెస్ మీట్‌కు వాయిదా వేసుకోవడం ద్వారా ప్రతిపక్షం తనకు తానే రాజకీయంగా మరింత ఆత్మరక్షణలో పడింది.

## గ్రూప్--1 పరీక్షలో చరిత్రలో చూడని అక్రమాలు

-మొదటిపేజీ తరువాయి

ఉత్తర్వులు ఇచ్చారని, మరోవైపు ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలు చేపట్టారని తెలిపారు. ఈ వ్యవహారంపై హైకోర్టు విచారణ జరిపి విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. గ్రూప్--1 వంటి అత్యున్నత స్థాయి ఉద్యోగాలకు అభ్యర్థులు రాసిన పరీక్షా పత్రాలను అర్హత లేని ప్రైవేటు వ్యక్తులతో దిద్దించారని చంద్రబాబు మండిపడ్డారు. విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, హెచ్‌ఓడీలు వంటి నిపుణులు చేయాల్సిన మూల్యాంకనాన్ని టీచర్లు, లెక్చరర్లు, ఇతర అనర్హులతో చేయించడం తీవ్ర ఉల్లంఘన అని అన్నారు. మొత్తం 158 మందితో ప్యానల్ ఏర్పాటు చేసి 72 మందికి మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని, వారిలో 25 మందిని అనధికారికంగా నియమించారని తెలిపారు. మరో 66 మంది ఎవాల్యుయేటర్లు కూడా అనధికారికంగా పరీక్షా పత్రాలు దిద్దారని ఆరోపించారు. ప్రైవేటు వ్యక్తుల ల్యాప్‌టాప్‌లకు మూల్యాంకన వివరాలను పంపించారని, పీడీఎఫ్ జవాబు పత్రాలను ప్రైవేటు ఈ-మెయిళ్లు, గూగుల్ డ్రైవ్, వాట్సప్ ద్వారా పంపారని చెప్పారు. ఏపీపీఎస్సీ స్ట్రాంగ్ రూమ్ నుంచి జవాబు పత్రాలను అనధికారికంగా తరలించి 84 రోజుల పాటు హాయ్‌లాండ్‌లో ఉంచారని తెలిపారు. మొదట హైదరాబాద్‌లో, ఆ తర్వాత హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం నిర్వహించారని పేర్కొన్నారు. హాయ్‌లాండ్‌లో మూల్యాంకనం జరగలేదని హైకోర్టుకు అఫిడవిట్ ఇచ్చిన సమయంలోనే లాజిస్టిక్స్ కోసం రూ.1.14 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. కొత్త చైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ మూల్యాంకనానికి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్‌లు ముద్రించినట్లు చెప్పారు. జవాబు పత్రాల్లో వేర్వేరు రాతలు, మార్పులు, చేర్పులు, ఓవర్‌రైటింగ్‌లు గుర్తించామని, 734 ఓఎంఆర్ స్లిప్‌లలో 718లో మార్పులు జరిగినట్లు వెల్లడించారు. 21 స్లిప్‌లపై ఎలాంటి సంతకాలు లేకపోవడం అక్రమాల తీవ్రతకు నిదర్శనమన్నారు. గ్రూప్--1 పరీక్ష రాసిన ఒక అభ్యర్థినే అదే పరీక్షకు ఎవాల్యుయేషన్ ఎగ్జామినర్‌గా నియమించడం మరింత దారుణమని అన్నారు. ఎగ్జామినర్ల జాబితాలను వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో పెట్టారని, మూల్యాంకనం జరిగిన హాల్లో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు లేకపోవడంతోపాటు మొబైల్ ఫోన్లను అనుమతించారని తెలిపారు. ఏపీపీఎస్సీ నిబంధనల ప్రకారం వైటనర్ వినియోగించకూడదని స్పష్టం చేస్తున్నప్పటికీ ఓఎంఆర్ మూల్యాంకన స్లిప్‌లలో వైటనర్ వినియోగించినట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నివేదికలు వెల్లడించాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని చంద్రబాబు విమర్శించారు. ప్రభుత్వ వ్యవస్థలు వ్యక్తుల కోసం కాకుండా యువత భవిష్యత్తు కోసం పనిచేయాలని, తప్పు చేస్తే కఠినంగా శిక్ష పడుతుందనే భయం ఉండాలని అన్నారు. అసెంబ్లీ జవాబుదారీతనానికి వేదిక అని, జరిగిన తప్పులపై సంబంధిత వ్యక్తులు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. సీఎం సీట్లో కూర్చుని నేరాలు చేసిన వ్యక్తి నేడు సమాధానం చెప్పేందుకు సభకు రాలేదని విమర్శించారు. గ్రూప్--1 పరీక్షల్లో జరిగిన అక్రమాలను పూర్తిగా విశ్లేషించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఏపీపీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేస్తామని, పారదర్శకమైన మూల్యాంకన విధానంతోపాటు బలమైన భద్రతా ప్రమాణాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు తీసుకుని సంస్కరణలు చేపడతామని వెల్లడించారు. తప్పు చేసిన వ్యక్తులు ఎప్పటికైనా దొరికిపోతారనడానికి ఏపీపీఎస్సీ గ్రూప్--1 వ్యవహారమే ఉదాహరణ అని సీఎం పేర్కొన్నారు.

## మేయర్, మున్సిపల్ చైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నిక

-మొదటిపేజీ తరువాయి

నిబంధనను సడలించినట్లు మంత్రి లోకేశ్ వెల్లడించారు. సీఆర్డీఏ పరిధి, విజయవాడ, విశాఖ, తిరుపతిలో పది ఎకరాలు, మిగిలిన చోట్ల 15 ఎకరాలుగా నిర్ణయించినట్లు చెప్పారు. శాసనసభలో ఉన్నత విద్య రెగ్యులేటరీ, మానిటరింగ్ కమిషన్ చట్టాన్ని కమిటీగా మార్పు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ, అధ్యాపకుల శ్రేణిలో రిజర్వేషన్ల సవరణతో పాటు ప్రైవేటు నైపుణ్య వర్సటీల స్థాపన, నియంత్రణ బిల్లులను మంత్రి ప్రవేశపెట్టారు. వీటిని సభ ఆమోదించింది. రాష్ట్రంలో అవయవాల దానం ప్రోత్సహించేందుకు దగ్గర బంధువుల నుంచి అవయవ మార్పిడి కోసం అనుమతులు ఇచ్చేందుకు వీలుగా చట్ట సవరణలు ప్రతిపాదించామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చెప్పారు. దీనివల్ల అవయవ దానం కోసం వేచి చూస్తున్న వారి జాబితాను తగ్గించి వారికి కొత్త జీవనాన్ని ఇచ్చేందుకు తోర్పడుతుందని వివరించారు.

**3 బిల్లులకు ఆమోదం:**

మేయర్, మున్సిపల్ చైర్మన్లను ప్రత్యక్షంగా ఎన్నుకునే బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. బిల్లుపై మాట్లాడిన పలువురు ఎమ్మెల్యేలు పట్టణాలు, నగరాల్లో మంచి పాలన అందే అవకాశం ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. దీనివల్ల మున్సిపల్ సంస్థల్లో ప్రజా సమస్యల పట్ల పూర్తిస్థాయిలో దృష్టి పెట్టే విధంగా మేయర్లు మున్సిపల్ చైర్మన్లు వ్యవహరిస్తారని ప్రభుత్వం ఆ లక్ష్యంతోనే ఈ చట్ట సవరణ ప్రతిపాదించిందన్నారు. దీనిపై పలువురు సభ్యులు తమ సానుకూలతను వ్యక్తం చేశారు. మూడు బిల్లులు సభలోని మొత్తం సభ్యుల ఆమోదాన్ని పొందాయి.

## పెట్టుబడుల వేటలో నెంబర్ 2 గా ఏపీ

విజయవాడ

ఏపీలో కూటమి ప్రభుత్వం మరో రికార్డు సృష్టించింది. దేశంలోకి వస్తున్న కొత్త పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంలో గణనీయంగా తన పనితీరు మెరుగుపరుచుకుంది. ప్రముఖ జాతీయ బిజినెస్ పత్రిక బిజినెస్ స్టాండర్డ్స్ ప్రాజెక్టు టుడే నివేదికల ఆధారంగా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో జాతీయస్థాయిలో రెండవ స్థానంలో నిలిచింది. గత రెండేళ్ల వ్యవధిలో పెట్టుబడుల ర్యాంకింగ్స్లో తొమ్మిదో స్థానం నుంచి.. ఏడు స్థానాలకు ఎగబాకి ద్వితీయ స్థానంలో నిలవడం విశేషం. ఇది నిజంగా గొప్ప విషయం. గడిచిన రెండేళ్లలో ఈ పురోగతి సాధించడం గొప్ప పరిణామం. కూటమి ప్రభుత్వానికి ఇది ఊతం ఇచ్చే విషయం.వైసిపి 2024 వరకు అధికారంలో ఉంది. ఆ ఏడాది ముగిసిన ఆర్థిక సంవత్సరంలో.. అంటే 2024 ఏప్రిల్ నాటికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ ప్రభుత్వం దేశంలో తొమ్మిది వ స్థానంలో నిలిచింది. ఆ తదుపరి ఏడాది ఆర్థిక సంవత్సరంలో క్రమేపి పనితీరు మెరుత్కు పరుచుకుంటూ వచ్చింది. ఇప్పుడు తాజాగా టాప్ 10 జాబితాలో రెండో స్థానంలో నిలవడం విశేషం. పారిశ్రామిక వాతావరణం, ప్రభుత్వ పాలసీల్లో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్లే ఈ గణనీయమైన పురోగతి సాధ్యమైంది.పారిశ్రామిక పెట్టుబడులను సాధించడంలో మహారాష్ట్ర ముందంజలో కొనసాగుతోంది. ఇప్పుడు దాని తర్వాత స్థానం ఏపీ దక్కించుకోవడం విశేషం. ఇతర అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను తట్టుకొని ఈ స్థానంలో నిలబడడం అనేది గొప్ప విషయం. రాజస్థాన్ మూడో స్థానంలో ఉండగా.. గుజరాత్ నాలుగో స్థానంలో నిలిచింది. ఒడిస్సా 5వ స్థానంలో ఉండడం గమనించదగ్గ విషయం. అయితే పారిశ్రామికంగా ఎంతో ముందు వరుసలో ఉండే పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కంటే ఏపీ చాలా వేగంగా పెట్టుబడులను ఆకర్షించిందని అర్థం అవుతోంది.అయితే పెట్టుబడులను ఆకర్షించడంలో మాత్రం ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పాత్ర ఉంది. ఒకవైపు ప్రభుత్వాన్ని నడుపుతూనే.. పెట్టుబడులను ఆకర్షించడం కోసం వీరు చేసే ప్రయత్నాలు అన్నీ ఇన్ని కావు. తరచూ విదేశీ పర్యటనలు, అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు వెళ్లడం.. ఇలా చాలా రకాల ప్రయత్నాలు ఫలితమే పారిశ్రామిక పెట్టుబడుల సాధనలో రెండో స్థానం. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్,, వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండో సిస్టం సమర్థవంతంగా పనిచేయడం వల్లే అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. తొమ్మిదవ స్థానంలో ఉన్న ఏపీని రెండో స్థానంలో నిలపడంలో కూటమి ప్రభుత్వం సక్సెస్ కనిపిస్తోంది. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తోంది..

swarna sagaram_Swarna sagaram.qxd 8/19/2026 10:04 PM Page 1



# ఒక మంచిచిత్రం వెయ్యి మాటల భావాన్ని వ్యక్తపరుస్తుంది

## "ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రఫీ రంగానికి అభినందనలు" దొంతి శ్రీధర్ రావు,ఏపీస్టేట్ వైస్ ప్రెసిడెంట్, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్.

నెల్లూరు స్వర్ణ సాగరం ఆగస్టు 19

రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 187 వ ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా బుధవారం, డైకస్ రోడ్ సెంటర్లోని రూడ్స్ కార్యాలయం వద్ద ఫోటోగ్రఫీ ఆధ్యుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఏపీస్టేట్ వైస్ ప్రెసిడెంట్ దొంతి శ్రీధర్ రావు మాట్లాడుతూప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారని, ఒక క్షణాన్ని శాశ్వతంగా, జ్ఞాపకంగా నిలిపే అద్భుతమైన కళ ఫోటోగ్రఫీ అని, మన జీవితంలోని ఆనందాలు, విజయాలు, చారిత్రక సంఘటనలు, ప్రకృతి అందాలు, సామాజిక పరిణామాలను చిత్రాల రూపంలో భద్రపరచడంలో ఫోటోగ్రఫీ కీలకపాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. ఫోటోగ్రఫీ కేవలం చిత్రాలను తీయ



డానికే పరిమితం కాకుండా సమాజంలోని వాస్తవ పరిస్థితులను ప్రపంచానికి తెలియజేసే శక్తివంతమైన మాధ్యమంగా మారిందని, ప్రకృతి వైపరీత్యాలు, ప్రజా సమస్యలు, సామాజిక సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చారిత్రక ఘట్టాలను ప్రజలకు చేరువ చేయడంలో ఫోటో జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు చేస్తున్న కృషి ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో మొబైల్ ఫోన్లు, డిజిటల్ కెమెరాలు, డ్రోన్లు వంటి ఆధునిక పరికరాల ద్వారా ఫోటోగ్రఫీ మరింత సులభతరమైందని, అయితే ఒక మంచి ఫోటోకు సాంకేతిక నైపుణ్యంతో పాటు సృజనాత్మకత, సమయస్ఫూర్తి, పరిశీలనా శక్తి కూడా ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగంలో సేవలందిస్తున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, "ఒక మంచి చిత్రం వెయ్యి మాటల భావాన్ని వ్యక్తపరుస్తుంది" అనే స్ఫూర్తితో బాధ్యతాయుతమైన, వాస్తవికమైన ఫోటోగ్రఫీని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీ.హెచ్.పీ గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కుడుముల సుబ్బారావు, విశ్రాంత ఏఎస్ఐ షేక్ మహబూబ్బాషా, ఉపాధ్యాయులు షేక్ సుభాన్, పి. భారతి, పి. రవిచంద్ర , ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# 187 వ ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ డే







ప్రతి సంవత్సరం ఆగస్టు 19న జరుపుకునే ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవానికి, ఫ్రెంచ్ కళాకారుడు, రసాయన శాస్త్రవేత్త లూయిస్ డాగ్యురే ఆవిష్కరణే మూలకారణం.

డాగ్యురే మరియు ఫోటోగ్రఫీ డేకి సంబంధించిన ముఖ్యమైన విశేషాలు:

డాగ్యురియోటైప్ ఆవిష్కరణ 1830లలో లూయిస్ డాగ్యురే మొదటి ఆచరణాత్మక ఫోటోగ్రాఫిక్ ప్రక్రియను అభివృద్ధి చేశారు. వెండి పూత పూసిన రాగి పలకపై కాంతి సున్నిత రసాయనాలను (సిల్వర్ హాలైడ్స్) ఉపయోగించి చిత్రాన్ని శాశ్వతంగా ముద్రించే పద్ధతిని ఆయన రూపొందించారు.

ఆగస్టు 19 ప్రాముఖ్యత... 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం ఈ డాగ్యురియోటైప్ సాంకేతికతకు సంబంధించిన పేటెంట్‌ను కొనుగోలు చేసి, ప్రపంచానికి ఉచిత బహుమతిగా అధికారికంగా ప్రకటించింది. అందుకే ఈ రోజును 'వరల్డ్ ఫోటోగ్రఫీ డే'గా జరుపుకుంటారు.నిస్ఫోర్ నీప్సేతో భాగస్వామ్యం ప్రపంచంలోనే తొలి శాశ్వత ఛాయాచిత్రాన్ని తీసిన జోసెఫ్ నిస్ఫోర్ నీప్సేతో కలిసి డాగ్యురే తొలుత పనిచేశారు. నీప్సే మరణానంతరం డాగ్యురే ఆ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, స్పష్టమైన చిత్రాలు వచ్చేలా మెరుగుపరిచారు.మొదటి మానవ చిత్రం: 1838లో పారిస్‌లోని బౌలేవర్డ్ డు టెంపుల్ వీధిని డాగ్యురే ఫోటో తీశారు. అందులో తన బూట్లను పాలిష్ చేయించుకుంటున్న ఒక వ్యక్తి చిత్రం రికార్డయ్యింది. ఫోటోగ్రఫీ చరిత్రలో ఒక మనిషి రికార్డయిన మొట్టమొదటి ఫోటో ఇదే.

డయోరమా థియేటర్ డాగ్యురే ఫోటోగ్రాఫర్ మాత్రమే




కాదు, ప్రముఖ చిత్రకారుడు మరియు రంగస్థల డిజైనర్. కాంతి ప్రభావాలతో విభిన్న దృశ్యాలను సృష్టించే 'డయోరమా' థియేటర్ వ్యవస్థను కూడా ఆయనే రూపొందించారు.డాగ్యురే చేసిన ఈ విప్లవాత్మక ఆవిష్కరణే ఆధునిక కెమెరాలు, డిజిటల్ ఫోటోగ్రఫీ విప్లవానికి బలమైన పునాది వేసింది.

బ్లడ్ డినేషన్ లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్స్

ఆగస్టు 19 ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా చిత్తూరు జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది.ఈ సందర్భంగా రక్తదాన శిబిరం మరియు ఐ క్యాంపులో నిర్వహించారు. రక్తదాన శిబిరంలో సుమారు 40 మంది పైన రక్తదానం చేయగా ఐ క్యాంపులో 140 మంది ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ లు ఐ క్యాంప్ లో పాల్గొని చెక్ చేసుకున్నారు. ఈ కార్యక్రమం సిపివిఏ అధ్యక్షుడు గణేష్, మరియు సిపివిఎ సభ్యులు శంకర్ లోక చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఆకుల గజేంద్ర పలమనేరు, జనసేన నాయకులు, యశ్వంత్ చిత్తూరు జనసేన నాయకులు పాల్గొన్నారు. ఫోటోగ్రాఫర్ కేవలం క్షణాలను బంధించడమే కాకుండా తదుపరి తరాలకు సరిపడా జ్ఞాపకాలను పదులపరుచుకునే విధంగా ఉంటుందన్నారు. సీనియర్ ఫోటోగ్రాఫర్ ఫోటోగ్రాఫర్స్ మద్రాస్ స్టూడియో రాజేంద్రప్రసాద్, ప్రతాప్ స్టూడియో విజయకుమార్, భవాని స్టూడియో పురుషోత్తం, చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగిరి, పూతలపట్టు నియోజకవర్గం లోని ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా కార్యవర్గ సభ్యులు

చిట్టిబాబు అధ్యక్షుడు,నాగయ్య నాయుడు సెక్రటరీ,మహేశ్వర్ ట్రెజరర్, రమేష్ వైస్ ప్రెసిడెంట్, టి ఎస్ వెంకటేష్ వైస్ ప్రెసిడెంట్ ,ఉమాపతి వైస్ ప్రెసిడెంట్, రాజగోపాల్ జాయింట్ సెక్రెటరీ, సుబ్రహ్మణ్యం జాయింట్ సెక్రెటరీ, శివ జాయింట్ సెక్రెటరీ ,సురేష్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ,హరికృష్ణ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఆర్ వి రమణ ఈసీ మెంబర్ ,మహేష్ ఈసీ నెంబర్, నసురుల్లా ఈసీ నెంబర్ ,శివ ఈసీ నెంబర్, సంధ్య ఈసీ నెంబర్.

# P4 పథకంతో బంగారు కుటుంబాల జీవితాల్లో వెలుగులు.

స్వర్ణ సాగరం రామకుప్పం ఆగస్టు 19,



పేదల సంక్షేమమే ధ్యేయంగా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ప్రవేశపెట్టిన ౹ా4 పథకం రాష్ట్రవ్యాప్తంగా బంగారు కుటుంబాలకు వరంగా మారింది. ఇందులో భాగంగా రామకుప్పం మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్, నాగరాజు అనే రెండు బంగారు కుటుంబాలకు జీవనోపాధి మెరుగుపరచేందుకు ప్రభుత్వం మరియు మెయిల్ కంపెనీ సంయుక్త సహకారంతో ఆటో కొనుగోలుకు ఒక్కొక్కరికి రూ.80,000 చొప్పున మొత్తం రూ.1,60,000 ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. సొంతంగా జీవనోపాధి పొంది గౌరవంగా బతకాలన్న సీఎం చంద్రబాబు గారి సంకల్పం ఈ పథకం ద్వారా నిజమవుతోందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ౹ా4 పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను ఆదుకొని వారిని స్వయం ఉపాధి దిశగా నడిపిస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలు అభినందనీయమని టీడీపీ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ తరహా సహాయం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష మాది అధ్యక్షులు వెంకటరమణ ఆంజనేయ రెడ్డి ముఖ్య. నేతలు సీతాపతి పద్మనాభరెడ్డి మంజునాథ్ రామకృష్ణప్ప అవినాష్ రెడ్డి రవి తదితరులు పాల్గొన్నారు .

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 19



బుధవారం నాడు రేణిగుంట సీడబ్ల్యూసీ ఈవీఎం గోడౌన్ భద్రతను తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పరిశీలించి, తిరుపతి జిల్లాకు చెందిన ఈవీఎంలు భద్రపరిచిన రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) గోదామును తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్వహిస్తున్న ప్రతినెలా తనిఖీల్లో భాగంగా ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్, గోదాములోని భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, సీలింగ్ వ్యవస్థ, ఇతర భద్రతా అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, అనంతరం ఈవీఎం గోదాం రిజిస్టర్‌లో సంతకం చేశారు.

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం

రెస్కో చైర్మన్ ప్రతాప్

స్వర్ణ సాగరం రామకుప్పం ఆగస్టు 18,



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఇంటింటికి టీడీపీ కార్యక్రమం కుప్పం మునిసిపాలిటీ పరిధిలోని కమతమ్మూరులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెస్కో చైర్మన్ ప్రతాప్ పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతుందని అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధా న్యత ఇస్తూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రైతులకు, మహిళలకు, యువతకు, పేదలకు ఉపయోగపడే పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్న కారణంగా పట్టణ, గ్రామీణ ప్రజలందరూ ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు.కుప్పం నియోజకవర్గంలో గత రెండేళ్లలో రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, విద్య, వైద్య రంగాల్లో మెరుగైన సేవలు, పారిశ్రామిక అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందని వివరించారు. ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా టీడీపీ కార్యకర్తలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ శ్రేణులతో కలిసి కమతమ్మూరులోని ప్రతి ఇంటికి వెళ్లి గత రెండేళ్ల కూటమి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ కోసం, ప్రజల కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను ప్రభుత్వం తప్పకుండా గుర్తిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. ప్రజలు కూడా రెండేళ్ల పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రభుత్వం ఇంకా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# గంగమ్మ తల్లిని దర్శించుకున్న బీజేపీ నాయకులు కోలా ఆనంద్



రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 19

రేణిగుంట లో జరుగుతున్న గంగమ్మ తల్లి జాతరలో బుధవారం బీజేపీ ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు గంగమ్మ తల్లి జాతరలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ చల్లని తల్లి దీవెనలు ప్రజలందరీ పై ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, బిజెపి జిల్లా నాయకులు బీడీ బాలాజీ, మెలగరం సుబ్రహ్మణ్యం రెడ్డి, కూరకాల్వ వేణు, ప్రేమ రెడ్డి, రాజారాయల్, నరేష్ రాయల్, వేణుగోపాల్, శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు

# 34% రిజర్వేషన్ సామాజిక న్యాయానికి నిదర్శనం

ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు.

స్వర్ణ సాగరం రామకుప్పం ఆగస్టు 18,



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనాభాలో 50.42% ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు పునరుద్ధరించడం సామాజిక న్యాయానికి నిదర్శనమని ఎక్స్ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు బుధవారం ప్రత్యేక ప్రకటనలో పేర్కొన్నారు. 1987లో ఎన్టీఆర్ 20%తో ప్రారంభించగా, 1995లో చంద్రబాబు 34%కి పెంచారని తెలిపారు. 2019లో వైసీపీ 24%కి తగ్గించి 16,800 మంది బీసీలకు అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం హామీ మేరకు 34% పునరుద్ధరించిందని కొనియాడారు. కుప్పం మునిసిపల్, రామకుప్పం, కుప్పం, గుడిపల్లె, శాంతిపురం మండలాల్లో బీసీలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయన్నారు. గత రెండేళ్లలో 1.17 కోట్ల మంది బీసీలకు రూ.32,534 కోట్లు సహాయం అందించామని, బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని ఆయన ప్రకటనలో స్పష్టం చేశారు.

# 19 న టిపి గూడూరు గ్రామపంచాయతీలో పల్లెవీక్షణం

## అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్వయంగా పరిశీలించనున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు, ఆగస్టు 19:

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేపట్టిన "పల్లెవీక్షణం" కార్యక్రమం ఈనెల 20న (గురువారం) టిపి గూడూరు మండలం టిపి గూడూరు గ్రామపంచాయతీలో నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా గ్రామంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలను సమీక్షించనున్నారు.పర్యటనలో భాగంగా టి.పి.గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో ప్రవీణ్ పొలాల నుంచి శ్రీహరి పొలాల వరకు ఫీల్డ్ ఛానల్ పునరుద్ధరణకు సంబంధించిన ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించడం, ఎస్ డబ్ల్యూ పిసి షెడ్, ఓహెచ్ఆర్ఎస్ ట్యాంక్‌లను సందర్శించి పరిశీలించడం, గమళ్లపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించడం, అలాగే టి.పి.గూడూరు గ్రామం హరిజనవాడకు చెందిన గ్రామస్థుల నుంచి పిజిఆర్ఎస్ ఫిర్యాదులను స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు..అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు ఇవ్వనున్నారు

# వాత్సల్య ఆర్ఫనేజ్ హోమ్ బాల బాలికలకు సినిమా వినోద కార్యక్రమం

## ఏర్పాటుచేసిన దాతలకు ధన్యవాదాలు తెలిపిన జనహిత వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రెటరీ జీవి సాంబశివరావు కమిటీ సభ్యులు



నెల్లూరు స్వర్ణ సాగరం ఆగస్టు 19

నెల్లూరు లోని జనహిత వాత్సల్య ఆర్ఫనేజ్ హోమ్ బాలబాలికలకు వినోదం కల్పించే క్రమంలో అమెరికాకు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ అక్షయ రెడ్డి అదేవిధంగా శ్రీకృష్ణ చైతన్య గ్రూప్ ఆఫ్ కాలేజెస్ డైరెక్టర్ మరియు శాసన మండలి సభ్యులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు రాణాకళాశాల సిబ్బంది స్నేహితులఆర్థిక సాయంతోవారి కళాశాల బస్సుల లోజాగ్రత్తగా తీసుకెళ్లి MGBమాల్ మల్టీప్లెక్స్ థియేటర్లోప్రత్యేకంగాఎనిమిది గంటలపాటు సినీ ప్రదర్శనచూపడం జరిగింది.ఆర్ఫనేజ్ బాల బాలికలు ఈ సినీ ప్రదర్శన తో ఎంతో ఉత్సాహపడితమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.ఈ సందర్భంగా ఇటువంటి సదవకాశం కల్పించి బాలబాలికలను ఉత్సాహపరిచినదాతలను ఆర్ఫనేజ్ హోమ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జీవిసాంబశివరావుకమిటీ సభ్యులు ధన్యవాదాలు వ్యక్తం చేశారు

## ఆర్.కె. డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలు, మాదక ద్రవ్యాలు, మహిళల భద్రతపై అవగాహన

### మహిళా స్టేషన్ డి.ఎస్పీ శ్రీనివాస రావు.



**చిత్తూరు.స్వర్ణసాగరం. ఆగస్టు 19**

చిత్తూరు పట్టణంలోని ఆర్.కె. డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు జిల్లా ఎస్పీ తుషార్ దూడి, ఐపీఏస్ ఆదేశాల మేరకు చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ డి.ఎస్పీ వారి సిబ్బందితో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ బి. శ్రీనివాసరావు విద్యార్థులతో ముచ్చటిస్తూ సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గుర్తు తెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా సమాచారం, ఓటీపీ లు, పాస్‌వర్డ్‌లను ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు.అదేవిధంగా డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితాన్ని కాపాడుకోండి అనే సందేశంతో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు.మహిళలు, బాలికల భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న శక్తి యాప్ గురించి విద్యార్థులకు వివరించి, అత్యవసర పరిస్థితుల్లో సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలల హక్కులు, మహిళలు మరియు బాలికలపై జరిగే నేరాల నివారణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు తమ దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారెడ్డి,ఏఎస్ఐ వెంకటేశులు,ఈగల్ టీమ్ సభ్యులు కుమార్,ఆర్.కె.డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఎం. రమేష్ బాబు,కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం సేవించే వాహనాలు చోదకులకు 10000/- జరిమానా

### రేణిగుంట పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన నిందితులకి శిక్ష

**రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 19**



జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలుపరిచారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ కోర్టు, తిరుపతి తీర్పు వెలువరించింది. మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపిన ఎం.రవినాయక్ (25), అనంతపురం బస్టాండ్ సమీపంలోని ఎస్టీ కాలనీ, కె. బాలసుబ్రహ్మణ్యం (52), వడమాలపేటలను దోషులుగా నిర్ధారించిన న్యాయస్థానం, ఒక్కొక్కరికి రూ.10,000/- చొప్పున జరిమానా విధించింది. అదనంగా, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 23 ప్రకారం ఆరు రోజుల కమ్యూనిటీ సర్వీస్ చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు 19-08-2026 నుండి 24-08-2026 వరకు రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్, బజార్ వీధి, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, నిర్వహణ పనులు చేపట్టాలని ఆదేశించింది. ఈ పనులను రేణిగుంట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ పర్యవేక్షించడంతో పాటు, కమ్యూనిటీ సర్వీస్ పూర్తయిన అనంతరం ఫొటోలతో కూడిన నివేదికను 25-08-2026 ఉదయం 10:30 గంటలలోపు న్యాయస్థానానికి సమర్పించాల్సి ఉంటుంది. జిల్లా ఎస్పీ సందేశం ప్రకారం మద్యం సేవించి వాహనం నడపడం వల్ల వాహనదారుడితో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ఏమాత్రం ఉపేక్షించబోమని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

## ప్రతి చిన్నారి కీ హక్కులు ఉన్నాయి లోక్ ఆధాలత్ జడ్జి. జీ. పద్మశ్రీ




**బుచ్చిరెడ్డిపాలెంస్వర్ణ సాగరం ఆగస్టు 19**

ప్రతి చిన్నారి కీ హక్కులు ఉన్నాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది అని లోక్ ఆధాలత్ జడ్జి . జీ. పద్మ శ్రీ పేర్కొన్నారు. బుధవారం బుచ్చిరెడ్డిపాలెం లోని ఆనందరావు జూనియర్ కళాశాల లోఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సు లో ఆమె ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలకు కూడా హక్కులు ఉన్నాయి అని ప్రతి ఒక్క ఉపాధ్యాయులు కూడా తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు.పిల్లలకు ఏ ఆపద వచ్చిన కూడా ప్రత్యేక చట్టాలు ఉన్నాయని గుర్తు చేసారు.18సంవత్సరాలలోపు బాల బాలికలు స్వేచ్ఛ గా భద్రం గా జీవించే హక్కు ఉందన్నారు.6సంవత్సరాలనుండి 14సంవత్సరాల పిల్లలకు ఉచిత నిర్భంద ప్రాథమిక విద్యా హక్కు ఉందని తెలియజేశారు.పోక్సో చట్టం 2012లైంగిక నేరాలు నుంచి బాలల రక్షణ చట్టం అన్నారు.అనంతరం బాలలు చేసే నేరాలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు చట్టాలు, లైంగిక వేధింపులు మానవ అక్రమ రవాణా చట్టాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో లోక్ ఆధాలత్ సభ్యులు మూరంరెడ్డి సుబ్బారెడ్డి, పారాలీగల్ వాలంటీర్ సురేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్, వేణు గోపాల్, రమణయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అర్ధనారీశ్వర స్వామి ఆలయం: విశ్వ శ్రేయస్సుకై ఒక ఆధ్యాత్మిక కేంద్రం





శ్రీకాళహస్తిలోని శ్రీ అర్ధనారీశ్వర స్వామి ఆలయం, కేవలం ఒక పుణ్యక్షేత్రం మాత్రమే కాదు, ఆధ్యాత్మికత, ప్రశాంతత, మరియు అపారమైన అభివృద్ధి సామర్థ్యానికి నిదర్శనం. ఇటీవల ఆలయాన్ని సందర్శించిన దండి నరేంద్ర , ఆలయ చైర్మన్ శ్రీమతి సునీత ప్రత్యేక ఆహ్వానం మేరకు, ఈ దివ్య క్షేత్రం యొక్క విశిష్టతను, దాని భవిష్యత్ ప్రణాళికలను లోతుగా విశ్లేషించారు. ఈ సందర్శన, కేవలం ఒక వ్యక్తిగత అనుభవం కాకుండా, ఆలయ అభివృద్ధికి ఒక సమగ్ర దృక్పథాన్ని అందించింది.

**ఆధ్యాత్మిక అనుభూతి, అభినందనీయ సేవలు**

ఆలయంలో అడుగుపెట్టగానే అనుభవమయ్యే ఆధ్యాత్మికత, ప్రశాంతత, సానుకూల వాతావరణం భక్తులను మంత్రముగ్ధులను చేస్తుంది. ఈ దివ్య క్షేత్రంలో దండి నరేంద్ర , కొత్తగా ఏపీ-గ్రీన్ కార్యనిర్వాహక కమిటీ చైర్మన్ బాధ్యతలు చేపట్టనున్న కొణిదెల నాగబాబు తమ పదవి ద్వారా మంచి ఫలితాలు సాధించాలని, రైతులు, సామాన్య ప్రజలు, పక్షులు, జంతువులు, పర్యావరణం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఆలయ చైర్మన్ శ్రీమతి సునీత ఆత్మీయత, భక్తులకు అందిస్తున్న సేవలు, ఆలయ అభివృద్ధిపై వారి చొరవ అభినందనీయం. ఎమ్మెల్యే బొజ్జా సుధీర్ రెడ్డి సరైన వ్యక్తిని చైర్మన్‌గా ఎంపిక చేసి ఆలయ అభివృద్ధికి అవకాశం కల్పించినందుకు దండి నరేంద్ర హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

**అపారమైన సామర్థ్యం, సమగ్ర ప్రణాళిక ఆవశ్యకత**

శ్రీ అర్ధనారీశ్వర స్వామి ఆలయం స్వయంభూ క్షేత్రం కావడం, విశిష్టమైన స్థలపురాణం కలిగి ఉండటం, విస్తారమైన భూభాగం, రహదారి అనుసంధానం, స్వర్ణముఖి నది సమీపంలో ఉండటం వంటి అనేక ప్రత్యేకతలను కలిగి ఉంది. ఈ ప్రత్యేకతలను సద్వినియోగం చేసుకుంటూ, సరైన ప్రణాళిక, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ, భక్తుల సౌకర్యాలు మరియు సమర్థవంతమైన నిర్వహణను కలిపితే, ఈ ఆలయం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా ఎదిగే సామర్థ్యం కలిగి ఉందని దండి నరేంద్ర అభిప్రాయపడ్డారు.

**ఆలయ అభివృద్ధికి కీలక సూచనలు**

**దండి నరేంద్ర ఆలయ అభివృద్ధికి పలు కీలక సూచనలు చేశారు, అవి:**

రోడ్డు కనెక్టివిటీ మెరుగుదల: ప్రస్తుతం ఆలయానికి పరోక్ష రహదారి ఉన్నప్పటికీ, పెండింగ్‌లో ఉన్న శివం--శివం రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా భక్తులకు మరింత సౌకర్యం కలుగుతుంది.

టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటు: శ్రీకాళహస్తీశ్వర స్వామి ప్రధాన ఆలయం నుంచి అర్ధనారీశ్వర స్వామి ఆలయంతో పాటు సమీపంలోని ముఖ్య ఆలయాలను కలుపుతూ ఉచిత లేదా నామమాత్రపు చార్జీతో ఒకే టికెట్‌పై ఆలయాల దర్శన సౌకర్యం కల్పించాలి. ఇది భక్తులకు సౌకర్యాన్ని, తక్కువ శ్రమతో ముఖ్య దేవాలయాల సందర్శనను అందిస్తుంది.

మరుగుదొడ్లు ఉ పరిశుభ్రత: భక్తుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా మహిళలు, పురుషులకు 5ం5 మరుగుదొడ్లు యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలి. పరిశుభ్రత కోసం కనీసం మరో ఇద్దరు సిబ్బందిని నియమించాలి.తాగునీటి సౌకర్యం: ప్రస్తుతం బోర్‌వెల్ నీటిపైనే ఆధారపడాల్సి వస్తుండటంతో, ఒక రోజుకి 10,000 లీటర్ల సామర్థ్యంతో ఆర్ఓ ప్లాంట్‌ను అత్యవసరంగా ఏర్పాటు చేయాలి.

హరిత ఆలయంగా అభివృద్ధి: సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆలయ ప్రాంగణాన్ని పచ్చని ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తితో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ఆదర్శంగా తీర్చిదిద్దాలి. దీర్ఘకాలికంగా పెరిగే సుమారు 1,000 పెద్ద వృక్షాలు, పూలు/అలంకార మొక్కలతో మరో 5,000 మొక్కలు నాటేలా సమగ్ర గ్రీన్ ప్లాన్ (1 బోర్, 1 మోటార్, డ్రిప్ సదుపాయం) రూపొందించాలి. నీటి సరఫరా, సంరక్షణ కోసం కనీసం ఇద్దరు గార్డెనర్లను నియమించాలి.

**భద్రతా ప్రహరీ:** స్వర్ణముఖి నదికి ఆనుకుని ఉన్న ప్రాంతం కావడంతో, వరదలు మరియు ప్రకృతి వైపరీత్యాలను దృష్టిలో ఉంచుకుని బలమైన, శాస్త్రీయ ప్రమాణాలతో కూడిన కాంపౌండ్ వాల్ నిర్మించాలి.

ఆధునిక వంటశాల ఉ నిత్య అన్నదానం: సమీపంలో తగిన ఆహార సౌకర్యాలు లేనందున, ఒకేసారి సుమారు 1,000 మంది భక్తులకు సేవలందించే ఆధునిక కిచెన్ ఏర్పాటు చేసి, ప్రస్తుతం సోమవారం మాత్రమే జరుగుతున్న ఉచిత అన్నదానాన్ని రోజువారీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

**భక్తుల అవసరాల కోసం దుకాణాలు:** పూజా సామగ్రి, కిరాణా మరియు ఇతర ప్రాథమిక అవసరాలు అందుబాటులో ఉండేలా దుకాణాలను ఏర్పాటు చేయాలి.

ఈ సూచనలు, శ్రీ అర్ధనారీశ్వర స్వామి ఆలయాన్ని కేవలం ఒక పుణ్యక్షేత్రంగానే కాకుండా, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే ఒక సమగ్ర ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి దోహదపడతాయి. ఈ ప్రణాళికల అమలుతో, ఆలయం విశ్వ శ్రేయస్సుకై ఒక శక్తివంతమైన కేంద్రంగా వికసిస్తుంది అనడంలో సందేహం లేదు.

## చిత్తూరు జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ఔట్ డోర్ వెపన్ పరీక్షలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ తుషార్ దూడి

**చిత్తూరు,స్వర్ణసాగరం.ఆగస్టు 19**

2025 బ్యాచ్‌కు చెందిన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు చిత్తూరు జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా జరుగుతున్న ఫైనల్ ఔట్ డోర్ వెపన్ పరీక్షలను జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ దూడి ఐపీఎస్ తనిఖీ చేశారుఈ సందర్భంగా శిక్షణలో ఉన్న స్కటీపీసీ ల ఆయుధ వినియోగ నైపుణ్యాలను, ఆయుధాలను సురక్షితంగా హ్యాండిల్ చేసే విధానాన్ని, ఫైరింగ్ సమయంలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలను ఎస్పీ పరిశీలించారు.శిక్షణలో భాగంగా నిర్వహిస్తున్న పరీక్షల తీరును, సిబ్బందికి అందిస్తున్న ప్రాక్టికల్ శిక్షణను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూపోలీస్ విధుల్లో ఆయుధ వినియోగం అత్యంత బాధ్యతతో కూడుకున్న అంశమని, ప్రతి పోలీసు సిబ్బంది ఆయుధాలను క్రమశిక్షణతో, పూర్తి అవగాహనతో మరియు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ వినియోగించాలన్నారు. ఆయుధాన్ని చేతబట్టిన ప్రతి సందర్భంలో అప్రమత్తత, నియంత్రణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.శిక్షణలో కేవలం ఆయుధ వినియోగంలోనే కాకుండా శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, చట్టాలపై అవగాహన, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, విధి నిర్వహణలో అప్రమత్తత వంటి అంశా ల్లో కూడా పూర్తి స్థాయిలో నైపుణ్యం సాధించాలని ఎస్పీ సూచించారు.పోలీస్ శాఖలోకి కొత్తగా అడుగుపెడుతున్న స్కటీపీసీ లు భవిష్యత్తులో ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా శిక్షణ కాలాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ పోలీసు సిబ్బందిగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అధికారులు శిక్షణలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, ప్రతి క్యాడెట్‌కు ప్రాక్టికల్‌గా పూర్తి అవగాహన కల్పించాలని,పరీక్షలను పారదర్శకంగా మరియు నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.ఈ తనిఖీలో ట్రైనింగ్ సెంటర్ డి.ఎస్పీ శ్రీ జె.రాంబాబు, ఆర్.ఐ. ఎం. టి ఓ వీరేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు





## నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి పిల్లుట్ల రఘు

### బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు

**స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా ఆగస్టు / 19**





నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నుండి ఎడమ కాలువకు వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పిల్లుట్ల రఘు డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ మండల పరిధిలోని వేపలసింగారం వద్ద ఎండిపోయిన పెద్ద కాలువను మంగళవారం ఇతర పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా పిల్లుట్ల రఘు మాట్లాడుతూ నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం 520 అడుగులు దాటినా ఎడమ కాలువ ఆయకట్టుకు నీటిని విడుదల చేయకపోవడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో డెడ్ స్టోరేజ్ ఉన్నప్పటికీ పంటలను ఎండనివ్వకుండా నీటిని విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నిండి ఉన్నప్పటికీ, సాగర్ ఆయకట్టుకు నీరు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం నుండి పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తున్నా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తుండటంతో 80 శాతం మంది రైతులు సాగు పనులు ప్రారంభించారని,సాగర్ నీటి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించి కాలువకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నగేష్ రాథోడ్,జగన్ నాయక్,కోలాహలం కృష్ణంరాజు, బాణావత్ బాబు నాయక్,పెరుమళ్ళ సతీష్, కోలపూడి చంటి,ముల్కపల్లి రాంబాబు, శ్రీనివాసరాజు,వెంకన్న,పుల శ్రీను,గుగులోతు కృష్ణ నాయక్,నాగుల్ మీరా,కాకునూరి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు పట్టణంలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ తుషార్ దూడి

**చిత్తూరు.స్వర్ణసాగరం. ఆగస్టు 19**





చిత్తూరు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా చిత్తూరు ప్రజలకు 24/7 రక్షణ అందించడమే చిత్తూరు జిల్లా పోలీసుల దృఢ సంకల్పం అన్నారు ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాల నివారణ కోసం అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో ఏర్పాటుచేసిన ఈ సెంటర్‌ను జిల్లా ఎస్పీ ఈరోజు సందర్శిం చారు .సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నియంత్రణ వ్యవస్థ, ట్రాఫిక్ మానిటరింగ్ వ్యవస్థ, అలాగే ఎమర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజం వంటి అంశాలను పరిశీలించారు. సెంటర్ నెట్‌వర్క్‌కు అనుసంధానించబడిన నగరంలోని ముఖ్య కూడళ్లలో ఉన్న సీసీ కెమెరాల దృశ్యాలను లైవ్‌గా పరిశీలించి,వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలు మరియు బాలికల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్‌లో అత్యవసర సమయంలో ఎస్ ఓ ఎస్ సంకేతం ద్వారా ఫిర్యాదులు అందిన వెంటనే కంట్రోల్ సెంటర్ సిబ్బంది పనితీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శక్తి యాప్‌లో అందించే ఎస్ ఓ ఎస్ సంకేతం,మహిళలు మరియు బాలికలకు రక్షణ కవచంగా పరిగణించవచ్చు. ఎస్ ఓ ఎస్ సంకేతం అందగానే,సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం చేరి, మహిళలు లేదా బాలికలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.డయల్ 112 విభాగాన్ని పరిశీలించిన ఎస్పీ,ఇది ప్రజలకు అత్యవసర పోలీసు, వైద్య, అగ్నిమాపక సేవలను అందించే అత్యంత కీలకమైన నంబర్ అని అన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పనిచేసే సిబ్బంది, డయల్ 112 సిబ్బంది, మరియు గస్తీ వాహన సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి కాల్ కూడా ఒక ప్రాణాంతక పరిస్థితిని సూచించవచ్చని చెప్పారు. అందుకే, కాల్ వచ్చిన వెంటనే త్వరితగతిన స్పందించడం అత్యంత అవసరం.స్పందన సమయాన్ని రెస్పాన్స్ టైం తగ్గించి, బాధితులకు తక్షణ సహాయం అందించడం, నేరాలను అరికట్టడం, ప్రజలలో భద్రత పట్ల నమ్మకం పెంచడం అనేది ముఖ్యమైన లక్ష్యం. ప్రతి క్షణం విలువైనదిగా భావించి, 112 కాల్‌లకు సరైన సమాధానం ఇవ్వడం, పెట్రోలింగ్ వాహనాలు వేగంగా సంఘటన స్థలానికి చేరుకోవడం, పోలీసుల బాధ్యతని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఇన్స్పెక్టర్ శ్రీ వేణు గోపాల్, ఎస్.ఐ., శ్రీమతి మోబీన్ తాజ్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 8/19/2026 10:04 PM Page 3



# బాధ్యతాయుతంగా ఉద్యోగుల వార్షిక వైద్య పరీక్షలు ప్రారంభించిన అమర రాజా

## ఉద్యోగుల ఆరోగ్యం, నివారణాత్మక వైద్య సంరక్షణకు అమర రాజా ప్రాధాన్యత

రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 19

ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమం మరియు నివారణాత్మక వైద్య సంరక్షణకు మరింత ప్రాధాన్యతనిస్తూ అమర రాజా సంస్థ వార్షిక వైద్య పరీక్షల కార్యక్రమాన్ని బుధవారం, ఆగస్టు 19న అమర హాస్పిటల్ భాగస్వామ్యంతో ఘనంగా ప్రారంభించింది. ఈ ఏడాది వార్షిక వైద్య పరీక్షల్లో భాగంగా తొలిసారిగా 45 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న ఉద్యోగులకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రవేశపెట్టారు. ఉద్యోగుల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య సహాయాన్ని సకాలంలో అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో డా. ప్రసాద్ గౌరినేని, చైర్మన్, అమర హాస్పిటల్ డా. రామాదేవి గౌరినేని, అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, భాగ్యలక్ష్మి, సీవోవో, ప్రశాంత్ తివారీ, సీఎస్ఓ, అమర రాజా డా. చంద్రబాబు, చీఫ్ మెడికల్ ఆఫీసర్, అమర రాజా, నళిని కుమార్, హెడ్ -- షేర్డ్ సర్వీసెస్, అమర రాజా; శ్రీరామ్ ఎస్వీ, సీఈఓ -- మంగళ్ ఇండస్ట్రీస్ శ్రీరామ్ వై, బిజినెస్ హెడ్ -- గల్లా ఫుడ్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. ప్రసాద్ గౌరినేని, డా. రామాదేవి గౌరినేని ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమం యొక్క ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉండటం వ్యక్తిగత సంక్షేమానికే కాకుండా,




సురక్షితమైన, ఉత్పాదకమైన మరియు సుస్థిరమైన సంస్థ నిర్మాణానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. వార్షిక వైద్య పరీక్షలు -- 2026లో మరో ముఖ్యమైన అంశంగా వైటాలిటీ ఇండెక్స్ ను ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఉద్యోగులు తమ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని మరింత మెరుగ్గా అర్థం చేసుకోవడంతో పాటు, గతంలో నిర్వహించిన ఆరోగ్య పరీక్షల ఫలితాలతో ప్రస్తుత ఫలితాలను పోల్చుకుని తమ ఆరోగ్య పురోగతిని తెలుసుకునే అవకాశం కలుగుతుంది. వార్షిక వైద్య పరీక్షలు -- 2026లో దేశవ్యాప్తంగా సుమారు 24,020 మంది ఉద్యోగులు వైద్య పరీక్షలకు అర్హులు కాగా, ఈ కార్యక్రమం సంస్థకు చెందిన ఐదు తయారీ కేంద్రాల్లో నిర్వహించబడుతోంది. అమర హాస్పిటల్, అమర రాజా సంస్థల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో నివారణాత్మక వైద్య సంరక్షణ, ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం మరియు ఆరోగ్యవంతమైన ఉద్యోగ బృందాన్ని నిర్మించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సాధారణ వార్షిక వైద్య పరీక్షలకు మించి, ఉద్యోగుల్లో నివారణాత్మక ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంపొందించేందుకు అమర రాజా చేస్తున్న నిరంతర ప్రయత్నాల్లో వార్షిక వైద్య పరీక్షలు -- 2026 మరో ముఖ్యమైన ముందడుగు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, వైటాలిటీ ఇండెక్స్ వంటి కొత్త కార్యక్రమాల ప్రవేశంతో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, సకాలంలో వైద్య సహాయం అందించే సంస్థ విధానం మరింత బలోపేతమైంది. ఉద్యోగుల ఆరోగ్యం కేవలం వైద్యపరమైన ప్రాధాన్యత మాత్రమే కాదు సంస్థకు అత్యంత కీలకమైన ప్రాధాన్యత అనే అమర రాజా నిబద్ధతను వార్షిక వైద్య పరీక్షలు -- 2026 కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.

# బీసీలకు రాజకీయ గుర్తింపు.. టీడీపీతోనే సామాజిక న్యాయం

## ఎన్టీఆర్ సేవలను కొనియాడిన ఇమ్మడిచెట్టి వెంకటేశ్వర్లు...బీసీలకు రిజర్వేషన్లపై చంద్రబాబు నిర్ణయం చారిత్రాత్మకం

## దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై హర్షం

నాయుడుపేట(స్వర్ణ-సాగరం)ఆగస్టు 19:

ప్రజల ఆరాధ్య దైవం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజికంగా గుర్తింపు కల్పించిన మహానేత అని టిడిపి నాయుడుపేట టౌన్ బీసీ సెల్ అధ్యక్షులు ఇమ్మడిచెట్టి వెంకటేశ్వర్లు కొనియాడారు.బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి, వారిని అధికార వ్యవస్థలో భాగస్వాములను చేసిన ఘనత ఎన్టీఆర్ గారికే దక్కుతుందని పేర్కొన్నారు.బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా చట్టం తీసుకురావడం హర్షణీయమని అన్నారు.ఈ నిర్ణయం బీసీల రాజకీయ సాధికారతకు మరో కీలక ముందడుగు అని అభివర్ణించారు.సాధారణ కుటుంబానికి చెందిన వడ్డెర మహిళ, క్లస్టర్ ఇన్‌చార్జ్ దళవాయి రమాదేవి గారిని గుర్తించి ఎ



మ్మెల్సీగా అవకాశం కల్పించడం బీసీలకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు.ఈ నిర్ణయానికి సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.గత పాలనలో బీసీ రిజర్వేషన్ల విషయంలో 176 జీవో పేరుతో నాటకాలు ఆడారని వెంకటేశ్వర్లు విమర్శించారు.అనంతరం 559, 560 జీవోల ద్వారా బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24.15 శాతానికి తగ్గించడం ద్వారా బీసీనాయకత్వానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు.దీనివల్ల సుమారు 16, 800 మంది బీసీల రాజకీయ అవకాశాలకు నష్టం జరిగిందని ఆయన పేర్కొన్నారు.బీసీలకు జరిగిన ఈ అన్యాయాన్ని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని స్పష్టం చేశారు.బీసీలను ఓటు బ్యాంకుగా కాకుండా పాలనా భాగస్వాములుగా తీర్చిదిద్దడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని అన్నారు.ఎన్టీఆర్ చూపిన బాటలో చంద్రబాబు నాయకత్వంలో బీసీలకు మరింత రాజకీయ ప్రాధాన్యత, సామాజిక గౌరవం లభిస్తోందని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.బీసీల సంక్షేమం, సాధికారత కోసం టిడిపి చేస్తున్న కృషికి ప్రతి బీసీ కుటుంబం అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# బంగారుపాళ్యం పట్టణంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన సీఐ కత్తి శ్రీనివాసులు



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 19

సురక్షిత చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత" కార్యక్రమంలో భాగంగా బంగారుపాళ్యం మండల కేంద్రంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించిన బంగారుపాళ్యం ఇన్‌స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు మరియు వారి సిబ్బంది జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశాల మేరకు "సురక్షిత చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత" కార్యక్రమంలో భాగంగా బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారుపాళ్యం ప్రాంతంలో బంగారుపాళ్యం ఇన్‌స్పెక్టర్ శ్రీ కత్తి శ్రీనివాసులు, మరియు వారి సిబ్బంది ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నేరాల నివారణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు, గుర్తు తెలియని వస్తువులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించాలని సూచించారు.అలాగే మహిళలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల బారిన పడకుండా అపరిచితుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు మరియు బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు.ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు, పోలీసు-ప్రజల మధ్య సాన్నిహిత్యాన్ని మరింత బలోపేతం చేసి "సురక్షిత చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత" లక్ష్యాన్ని విజయవంతంగా అమలు చేయగలమని అధికారులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# సోమిరెడ్డి చోరవతో గిరిజన అంతిమ యాత్రకు తప్పిన అడ్డంకులు

### - నీటి సంఘ అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి

మనుబోలు,స్వర్ణసాగరం:



మండలం లోని చంద్రమౌళి నగర్ గిరిజన వాసులకు స్మశాన వాటికకు దారి సమస్య తీరింది. 50 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఎమ్మెల్యే సోమిరెడ్డి చొరవతో ఇబ్బందులు తొలగాయని గిరిజనులు బుధవారం హర్షం వ్యక్తం చేస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నీటి సంఘ అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి మాట్లాడుతూ,ఎన్నో ఏళ్లగా గిరిజనులకు స్మశానానికి దారి లేక చాలా ఇబ్బంది పడుతూనే వారని ఈ విషయాన్ని ఇటీవల కాలనీకి పర్యటనకు వచ్చిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఆయన స్పందించి దారి ఏర్పాటు చేయమని అధికారులు ఆదేశించారన్నారు. ఇందులో భాగంగా ఒక కిలోమీటర్ మేర జంగిల్ క్లియరెన్స్ చేపట్టి శ్మశాన వాటిక దారిని ఆధునీకరిస్తామని తెలిపారు. అలాగే రైతులు దారి ఏర్పాటుకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. గత వైకాపా పాలనలో వేలం పాటలపాలైన ఏరులు, కాలవలు,చెరువులను సొసైటీ ద్వారా విడిపించి, గిరిజనులకు స్వయంగా చేపలు పట్టుకునేలా అనుమతులు ఇప్పిస్తామని ఆయన వెల్లడించారు.కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాయపాటి కిరణ్ కుమార్, చెల్లగిరి ప్రసాద్,జి.తేంద్ర గౌడ్,కలికి సుధీర్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# కన్నలి గ్రామంలో ఘనంగా నూతన గృహ ప్రవేశ వేడుకలు,

స్వర్ణసాగరం- తొట్టంబేడు,



తొట్టంబేడు మండలం కన్నలి గ్రామంలో కన్నలి ప్రతాప్‌రెడ్డి, కన్నలి ప్రవీణ్‌రెడ్డి నూతన గృహ ప్రవేశ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన నివాసంలో శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు.ఈ శుభకార్యక్రమానికి శ్రీమతి బొజ్జల రిషితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జరిగిన ఈ వేడుక ఆత్మీయంగా సాగింది.నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు రిషితారెడ్డితో పాటు బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ సత్యనారాయణ స్వామివారి ఆశీస్సులతో నూతన గృహం సకల శుభాలు, ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# పవిత్ర ఆలయాన్ని కంపు కొట్టిస్తున్నారు

### - మండల కన్వీనర్ బొమ్మి రెడ్డి హరిగోపాల్ రెడ్డి



సంగమేశ్వర ఆలయ ప్రాంగణాన్ని టీడీపీ తమ్ముళ్లు మొక్కజొన్న డంప్ యార్డ్ తో కంపుకూటిస్తున్నారని వైసీపీ నాయకులు బుధవారం ధ్వజమెత్తారు. మంగళవారం టీడీపీ నాయకులు వైసీపీ నాయకులు మీద చేసిన విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. మనుబోలులోని బద్దెవోలు క్రాస్ రోడ్డు సమీపంలోని సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో మండల కన్వీనర్ హరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.., కాకాణి గోవర్ధన్ రెడ్డిని విమర్శించడం మంచిది కాదని హెచ్చరించారు. ఆలయ ప్రాంగణమంతా భారీ వాహనాలతో, మొక్కజొన్న డంపుతో కంపు కొడుతూ దెబ్బతింటుందని వెల్లడించారు. న్యాయం మాట్లాడటానికి వయస్సుతో పనిలేదని, రాజకీయాల్లోకి వచ్చి కార్లు కొనవలసిన అవసరం లేదని ప్రతి సాఫ్ట్వేర్ కి ఇంటింటికి కారు ఉందని గుర్తు చేశారు.తాము రైతులకు ఎప్పుడూ వ్యతిరేకం కాదని, రైతులు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్లపై వడ్లు ఆరబోసుకోవచ్చని స్పష్టం చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు నాణ్యతతో కూడిన రోడ్లు వేశామని, నాలు గున్నరేళ్లు గడిచినా ఆ రోడ్లు ఇప్పటికీ బలంగానే ఉన్నాయని చెప్పారు. మొక్కజొన్న గడ్డిని అక్కడ తొలగించాలని సంబంధిత వ్యక్తులతో మాట్లాడామని, ఆదివారంలోగా ఖాళీ చేస్తామని చెప్పి బుధవారం వరకు ఉంచడం తగదన్నారు. విలేకరుల సమావేశంలో వైయస్సార్‌సీపీ నాయకులు దాసరి భాస్కర్ గౌడ్, ముంగర రవీంద్రారెడ్డి, సూరపనేని కిషోర్ నాయుడు, భాస్కర్ రెడ్డి, కుడమల వెంకటరమణయ్య గౌడ్, కోసూరు కోటేశ్వరరావుగౌడ్, ఏలూరు భాస్కర్ రెడ్డి, దాసరి మహేంద్ర వర్మ, గిద్దంటి రమణయ్య, దుగ్గన వేణు యాదవ్, దుగ్గన సురేష్,హరినాథ్ రెడ్డి, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ స్వయంభు మొగిలీశ్వర స్వామి దేవస్థానం నందు వరుణ జపం మరియు వరుణ హోమం

బంగారుపాలెం.స్వర్ణసాగరం.ఆగస్టు 19



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండల పరిధిలోని మొగిలి గ్రామంలో వెలసిన శ్రీ మొగిలీశ్వర స్వామి దేవస్థానం నందు బుధువారం కమీషనరు హిందూ దేవాదాయశాఖ విజయవాడ వారి ఆదేశాల మేరకు రాష్ట్రంలో విస్తారంగా వానలు పడాలని ,రాష్ట్రం సుభిక్షంగా వుండాలని ఆలయములో వరుణ జపం మరియు వరుణ హోమం నిర్వహించవలసినదిగా ఆదేశించారు.వారి ఆదేశాల మేరకు బుధవారం రోజు చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామంలో వెలసిన శ్రీ స్వయంభు మొగిలీశ్వర స్వామి దేవస్థానం నందు వరుణ జపం మరియు వరుణ హోమం నిర్వహించడం జరిగినది.ఆలయము నందు రెండు ప్రధాన కలశములను ఏర్పాటు చేసి వాటికి శాస్త్రోక్తంగా గణపతి పూజ ,వరుణ పూజ అనంతరం నిర్వహించి ఆలయము వెలుపల గల కోనేరు వద్ద ముగ్గురు రుత్వికులు చేత వరుణ జపం కార్యక్రమం చేయడం జరిగినది. తదుపరి వరుణ జపం పూర్తి అయిన తరువాత ఆలయము లోపల ఐదుగురు రుత్వికుల చేత వరుణ హోమం, నైవేద్యం పూర్ణాహుతి అనంతరం ప్రతిష్టించిన కలసం తీసుకొని వెళ్ళి స్వామి వారికి అభిషేకం,హారతి నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమములో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎం.బి .విజయకుమార్ , కార్యనిర్వహణాధికారి ఎ. మునిరాజ ఆలయ అర్చకులు గంగాధర్ గురుకుల్, సోము గురుకుల్, పవన్ గురుకుల్, దండపాని గురుకుల్ , కార్తిక్ మరియు సిబ్బంది పాల్గొన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఉన్నం వాసుదేవ నాయుడు దంపతులు,

స్వర్ణసాగరం - తొట్టంబేడు,



శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పొయ్య గ్రామంలోని చిన్నసింగమాల ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గంధం--కట్ట కుటుంబాల వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, ఆయన సతీమణి, మండల ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.గంధం మునిరత్నం, మంగమ్మ దంపతుల కుమార్తె కీర్తనకు, కట్ట వెంకటయ్య, మునమ్మ దంపతుల కుమారుడు చెంగయ్య (ఎంబీఏ)తో వివాహం జరిగింది. వివాహ వేడుకకు హాజరైన ఉన్నం వాసుదేవ నాయుడు దంపతులు నూతన వధూవరులకు గిఫ్ట్ అందజేసి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# రిజర్వేషన్ తో బీసీలకు పెద్దపీట

## 34 శాతం రిజర్వేషన్ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం

## వెనుకబడిన వర్గాలకు వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం




స్వర్ణ సాగరం వాకాడు

స్థానిక సంస్థల్లో వెనుకబడిన బీసీ వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్న పదానికి నిదర్శనం ఈ రిజర్వేషన్లు భాగం బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించినందుకు కృతజ్ఞత భావంగా తిరుపతి జిల్లా వాకాడు మండల కేంద్రంలోని అశోక పిల్లర్ సెంటర్ వద్ద తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణమూర్తి, మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతే లక్ష్యంగా టిడిపి పార్టీ ఆవిర్భవించిందని బీసీలకు వెన్నుదన్నుగా స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పార్టీని బలపరిచారని, బీసీలకు రాజకీయ సామాజిక ఆర్థిక గుర్తింపు టిడిపి ప్రభుత్వం హయాంలోనే లభించిందని గతంలో బీసీలకు 27 శాతం రిజర్వేషన్ కల్పించి వారిని రాజ్యాధికారంలో భాగస్వాములు చేశారని నేడు అది పూర్తిస్థాయిలో అందించేందుకు కూటమి ప్రభుత్వం రిజర్వేషన్ పెంచిందని బీసీల కు న్యాయం చేసిందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో తూపిని ఆయకట్టు చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పిటిసి బత్తిన ప్రమీల, ద్వారకానాథ్ రెడ్డి, కొప్పోలు సురేష్,గజ్జల గోపి నాయుడు, అన్న మేటి చంద్రయ్య,చిన్ని బాయ్ ,భార్గవ్ రామ్,రమణయ్య, మోహన్, కూటమి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు

# ఉరికి బదులు ఇంజెక్షన్...

భారతదేశంలో మరణశిక్ష అమలు విధానంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు చెప్పింది. భారతదేశంలో మరణశిక్ష అమలు విధానంపై మరోసారి కీలక చర్చ తెరపైకి వచ్చింది. ఉరిశిక్షకు బదులుగా తక్కువ బాధాకరమైన, మరింత మానవీయమైన పద్ధతిని అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వం, నిపుణుల పరిశీలన, న్యాయస్థానం ముందున్న రాజ్యాంగపరమైన ప్రశ్నలపై ఆధారపడనుంది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని విచారిస్తోంది. న్యాయవాది రిషి మల్హోత్రా దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రస్తుతం అమల్లో ఉన్న ఉరిశిక్ష విధానాన్ని సవాల్ చేశారు. ఉరి ద్వారా మరణశిక్ష అమలు చేయడం క్రూరమైన, అమానవీయమైన పద్ధతిగా మారే అవకాశం ఉందని ఆయన వాదించారు. మరణశిక్ష విధించిన వ్యక్తికి కూడా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించే గౌరవంతో జీవించే హక్కు, దానికి అనుబంధంగా గౌరవప్రదమైన ప్రక్రియకు సంబంధించిన హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పిటిషనర్ ప్రధానంగా ఉరిశిక్షకు ప్రత్యామ్నాయంగా ప్రాణాంతక ఇంజెక్షన్ వంటి పద్ధతులను పరిశీలించాలని కోరారు. అంతేకాకుండా కాల్చివేత, విద్యుదాఘాతం, గ్యాస్ ఛాంబర్ వంటి ఇతర పద్ధతులను కూడా తన పిటిషన్‌లో ప్రస్తావించారు. అయితే ఏ పద్ధతి నిజంగా తక్కువ బాధాకరమైనది, మానవీయమైనది అనే విషయాన్ని శాస్త్రీయ ఆధారాలతో పరిశీలించాల్సిన అవసరం ఉందని వాదించారు. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యామ్నాయ పద్ధతుల అంశాన్ని పూర్తిగా పక్కన పెట్టలేదు. గత విచారణల్లో నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి, మరణశిక్ష అమలు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నట్లు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. వైద్య, న్యాయ రంగాలకు చెందిన నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది. 2026 జనవరి 22న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు వెంటనే తుది తీర్పు ఇవ్వకుండా ఆదేశాలను రిజర్వ్ చేసింది. పిటిషనర్, కేంద్ర ప్రభుత్వం తమ లిఖితపూర్వక వాదనలు సమర్పించేందుకు మూడు వారాల సమయం ఇచ్చింది. ఇదిలా ఉండగా, ప్రస్తుత చట్టపరమైన వ్యవస్థలో మరణశిక్ష అమలు విధానం ఉరిశిక్షగానే కొనసాగుతోంది. పాత అతీఖఅలోని సెక్షన్ 354(5)కు సమానమైన నిబంధన ప్రస్తుతం భారతీయ నాగరిక్ సురక్షా సంహిత లోని సెక్షన్ 393(5)లో ఉంది. మరణశిక్ష విధించిన వ్యక్తిని ఉరి ద్వారా మరణించే వరకు శిక్ష అమలు చేయాలని ఈ నిబంధన పేర్కొంటుంది. ఉరిశిక్ష రాజ్యాంగబద్ధతపై గతంలోనూ సుప్రీంకోర్టు పరిశీలన జరిపింది. 1983లో 'దీనా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ఉరి ద్వారా మరణశిక్ష అమలు చేయడం రాజ్యాంగబద్ధమేనని కోర్టు తీర్పు ఇచ్చింది. ఇప్పుడు పిటిషనర్ మాత్రం మారిన శాస్త్రీయ ప్రమాణాలు, మానవ హక్కుల దృక్పథం, గౌరవంతో కూడిన



జీవితం అనే రాజ్యాంగ భావనల నేపథ్యంలో ఈ అంశాన్ని మరోసారి పరిశీలించాల్సిన అవసరం ఉందని వాదిస్తున్నారు. అయితే ప్రత్యామ్నాయ పద్ధతిని అమలు చేయడం అంత సులభమైన నిర్ణయం కాదు. ఏ విధానం తక్కువ బాధాకరమైనది? దాన్ని శాస్త్రీయంగా ఎలా నిర్ధారించాలి? వైద్య నిపుణుల పాత్ర ఎంతవరకు ఉండాలి? మరణశిక్ష విధించిన వ్యక్తికి అమలు పద్ధతిని ఎంచుకునే అవకాశం ఇవ్వాలా? వంటి అనేక ప్రశ్నలకు సమాధానం అవసరం. అందుకే ఈ కేసు కేవలం ఉరిశిక్షకు ప్రత్యామ్నాయం గురించిన వివాదంగా కాకుండా, మరణశిక్షను ఒక రాష్ట్రం ఎలా అమలు చేయాలి? శిక్ష అమలులోనూ మానవ గౌరవానికి స్థానం ఉందా? అనే కీలక రాజ్యాంగ ప్రశ్నగా మారింది. ప్రస్తుతం ఉరిశిక్షకు ప్రత్యామ్నాయ పద్ధతిని సుప్రీంకోర్టు అధికారికంగా ఆమోదించిందని చెప్పడం సరికాదు. కేంద్రం పరిశీలన, నిపుణుల అభిప్రాయాలు, పిటిషనర్ వాదనలు, రాజ్యాంగపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఈ వ్యవహారంలో తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది. ఉరి తీయడానికి బదులుగా ప్రాణాలు తీసేందుకు తక్కువ నొప్పిని కలిగించే ప్రత్యామ్నాయ పద్ధతులను అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దేశంలో ఉరిశిక్ష అమలు విధానం యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. ఉరితీయడం అనేది చాలా బాధాకరమైన, అమానవీయమైన పద్ధతి అని పిటిషనర్, న్యాయవాది రిషి మల్హోత్రా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఉరిశిక్ష అమలు చేసిన తర్వాత మరణించినట్లు ప్రకటించే మొత్తం ప్రక్రియకు 40 నిమిషాలకు పైగా పడుతుందని, అదే ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వడం లేదా కాల్చి చంపడం లాంటి పద్ధతుల ద్వారా ఐదు నిమిషాల్లోనే ప్రక్రియ పూర్తవుతుందని ఆయన వివరించారు భవిష్యత్తులో శాస్త్రీయ, వైద్యపరమైన బలమైన ఆధారాలు లభిస్తే ఈ అంశాన్ని మరోసారి పరిశీలించే అవకాశం ఉందని తెలిపింది. ఉరిశిక్ష అమలులో ఉన్న ఇతర ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కావాలనుకుంటే ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసుకోవచ్చని సూచించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి స్పందిస్తూ, ప్రత్యామ్నాయ పద్ధతులను పరిశీలించడానికి ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు కోర్టుకు తెలిపారు. కాగా 2025 అక్టోబర్ 15న జరిగిన విచారణలో పాత పద్ధతిని మార్చడానికి కేంద్రం సుముఖంగా లేకపోవడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దోషులకు ఉరి లేదా ఇంజెక్షన్ విధానాల్లో ఒకదాన్ని ఎంచుకునే ఆప్షన్ ఇవ్వాలన్న ప్రతిపాదన ఆచరణాత్మకంగా సాధ్యం కాదని కేంద్రం అఫిడవిట్‌లో పేర్కొంది. దీనిపై స్పందించిన కోర్టు, కాలంతో పాటు విషయాలు మారుతున్నాయని, పాత పద్ధతిని మార్చుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడమే అసలు సమస్య అని వ్యాఖ్యానించింది. ఈ కేసుకు సంబంధించి జనవరి 22నే విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు తాజాగా తన తీర్పును వెలువరించింది.

# దారికొచ్చిన జార్ఖండ్!

కేంద్ర విద్యామంత్రి రాజీనామా కోరుతూ వినూత్న తరహా నిరసనలతో, నిరాహార దీక్షలతో ఢిల్లీ జంతర్ మంతర్‌లో ఊహించని విజయం సాధించిన జెన్ జీ... రాంచీలో సైతం ఘన విజయం సాధించింది. జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్--కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (జేఎస్ఎస్‌సీ--సీజీఎల్) పరీక్షను రద్దు చేయటానికి ఎట్టకేలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అంగీకరించింది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటనతో ఉద్యమకారుల శిబిరం ఆనందోత్సాహాలతో పొంగిపోగా... రాష్ట్రంలో గత పన్నెండేళ్ల నుంచీ జరిగిన పరీక్షల్లో అవకతవకలు జరిగాయనీ, వాటిపై కూడా చర్యలు తీసుకోబోతున్నామనీ ఆయన చెప్పటం వేలాదిమంది ఉద్యోగుల జీవితాలను ప్రశ్నార్థకం చేసింది. ఆ నియామకాలన్నీ రద్దు చేస్తారా... చేస్తే దానికి అనుసరించే విధానమేమిటన్న ప్రశ్న ఇప్పుడందర్నీ వేధిస్తోంది. వీరుగాక తమ ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారున్నారు. అన్నీ పూర్తయి నియామకాల కోసం ఎదురుచూస్తున్న మరో 1,975 మంది వీరికి అదనం. తగిన విద్యార్హతలు గలవారంతా ప్రభుత్వోద్యోగం కోసం వెంపర్లాడతారు. ప్రయత్నం ఫలిస్తే జీవితంలో శాశ్వతంగా స్థిరపడిపోవచ్చని ఆశపడతారు. ఆ ఉద్యోగ భద్రత అలాంటిది మరి. కానీ ప్రభుత్వోద్యోగాలు వందల్లో ఉంటే, పోటీపడేవారు లక్షల్లో ఉంటారు. అందుకే తమ చదువులు ఎంతవరకూ పనికొస్తాయన్న భయాందోళనలు అభ్యర్థుల్లో సహజంగానే ఉంటాయి. ఈ పరిస్థితిని శిక్షణ సంస్థలు సొమ్ముచేసుకుంటాయి. లక్షలమంది వేలకు వేలు ఖర్చుచేస్తారు. తీరా ప్రశ్నపత్రాలు లీకయ్యాయని తెలిశాక అలాంటివారి గుండె రగిలిపోదా? ఈ ఆగ్రహావేశాలనుంచే జెన్ జీ ఉద్యమం పురుడు పోసుకుంది. కేంద్ర స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్ష అయినా, ఇప్పుడు జార్ఖండ్‌లో జరిగిన ఉద్యోగ నియామకాలైనా వివాదాస్పదంగా మారింది అందుకే. సమాజంలో, జీవితంలో అనిశ్చితి అలుముకున్న వర్తమానంలో అన్యాయం జరిగిందనుకున్నప్పుడు ఉద్యమాలు పోటెత్తడం అనివార్యమని గ్రహించక, యువత డిమాండ్లను అవగాహన చేసుకోక తమకు అలవాటైన పద్ధతుల్లో ఉద్యమాల్ని అణిచేద్దామని ఢిల్లీలోనూ, రాంచీలోనూ పాలకులు ప్రయత్నించారు. రెండుచోట్లా పాలక కూటములు వేర్వేరు. అవి పరస్పరం ప్రత్యర్థి పక్షాలు. అయినా వారి



చర్యల్లో సారూప్యత కనబడటం గమనించదగ్గది. రెండుచోట్లా చివరకు పాలకులు వాస్తవం గ్రహించక తప్పలేదు.

జార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పోటీ పరీక్షలన్నిటినీ టీఎస్సార్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేటు లిమిటెడ్(టీడీపీఎల్) నిర్వహిస్తూ వచ్చింది. ఈ సంస్థ జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) కోసం ఇంతవరకూ 10 పరీక్షలు, జెఎస్ఎస్‌సీకి 5 నిర్వహించింది. వీటిద్వారా బ్లాక్ సప్లయ్ ఆఫీసర్ మొదలుకొని డిప్యూటీ కలెక్టర్, టీచర్, సివిల్ జడ్జీ, ప్రాసిక్యూటర్ వరకూ అనేక పోస్టులు భర్తీ అయ్యాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో త్రిశంకు స్వర్గంలో పడ్డామనీ, జనం దృష్టిలో నేరగాళ్లుగా మిగులుతామనీ వారంతా గొల్లుమంటున్నారు. తమ నిర్లక్ష్యంతో, కొన్నిసార్లు కుమ్మక్కుతో యువత ఆశయాలపై చన్నీళ్లు చల్లుతున్నామని పాలకులు గుర్తించటం లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ ఎన్డీయే కూటమి ప్రభుత్వం మొండిగా ప్రవర్తిస్తోంది. టీడీపీ నేతలు క్రీడా ధ్రువీకరణ పత్రాలివ్వటం, సర్కారు ఉద్యోగాలు పంచడం వింత. జాతీయస్థాయి పతక గ్రహీతలు కూడా వారిముందు బలాదూరే! కూటమి భాగస్వామిగా ఉన్న బీజేపీ కళ్లు మూసుకుంది. జార్ఖండ్‌లో ఉద్యమవీరుల పార్టీగా ప్రతిష్ఠ పొందేందుకు నానారకాల ప్రయత్నం చేసిన పక్షమే అక్రమాలెక్కడంటూ దబాయింపులకు దిగుతోంది. దగాపడిన డీఎస్సీ అభ్యర్థులు చానెళ్లలో తమ గోడు వినిపిస్తుంటే... ప్రశ్నపత్రాల లీక్ మొదలుకొని ర్యాంకుల ప్రకటన, నియామకాల వరకూ సర్వం సందేహాలకు తావిస్తుంటే టీడీపీకి 'తందాన తాన' పక్షంగా మిగిలింది. పరీక్ష నిర్వహణ వ్యవస్థలో ఉన్న వ్యక్తే ఫస్ట్ ర్యాంకర్ అని తెలిసి గుట్టుచప్పుడు కాకుండా అతగాడి పేరు డేటానుంచి మాయం చేయటం దేన్ని సూచిస్తోంది? జార్ఖండ్‌ను చూశాకైనా బుద్ధి తెచ్చుకుని తప్పు గ్రహించక పోతే కూటమి పక్షాలకు ఏపీ జనం టోకున బుద్ధి చెప్పటం ఖాయం.

# ట్రంప్ మ్యాప్‌ల సంబరం!

హార్మూజ్ జలసంధిని 'చాలా త్వరలోనే' అమెరికా భూభాగంగా మారుస్తానని గతవారం ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పుడు ఇరాన్‌పై మళ్లీ భీకర దాడులకు తెగబడొచ్చని కొందరు అనుమానించారు. తీరా మంగళవారం ఆయన చేసిందల్లా 'అమెరికా కొత్త భూభాగం' అని రాసివున్న హార్మూజ్ జలసంధి మ్యాప్‌ను విడుదల చేయటమే. దీంతో ఇరాన్ దౌత్యవేత్తలు ప్రతిదాడికి దిగారు. కాలిఫోర్నియాను ఇరాన్ భూభాగంగా చూపుతూ ఇరాన్ కాన్సులేట్ ఒక చిత్రపటాన్ని విడుదల చేసింది. వేరే దేశాల భూభాగాలు డిమాండ్ చేయటం, వాటిని అమెరికా భౌగోళిక చిత్రపటాల్లో భాగంగా చూపటం ట్రంప్‌కు కొత్తేం కాదు. రెండోసారి అధికారంలోకొచ్చిన వెంటనే గ్రీన్‌లాండ్‌పై ఆయన కన్నుపడింది. అలాగే కెనడాను అమెరికాలో విలీనం చేసుకుని 51వ రాష్ట్రంగా మారుస్తామనీ, పనామా కాల్వ ఇకపై తమదేననీ, గాజాను 'సొంతం' చేసుకుంటామనీ కూడా పలుమార్లు చెప్పారు. అందుకు సంబంధించి ఒక వీడియో రూపొందించి విడుదల చేశారు. వెనిజులా మ్యాప్‌లో అమెరికా జెండాను సూచించే రంగులు నింపారు. అలాగే ఇకపై గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా వ్యవహరించాలంటూ ఉత్తర్వులు జారీచేశారు. అట్లాంటిక్ మహాసముద్రంలోని ఈ ప్రాంతం మెక్సికోకు పశ్చిమ, దక్షిణ దిశల్లో, అమెరికాకు ఉత్తరంవైపు, క్యూబాకు ఆగ్నేయంవైపు ఉంది. పేరు మార్చినా ప్రాదేశిక జల పరిధులేమీ మారడంలేదు గనుక మెక్సికో, క్యూబాలు ఈ విషయంలో మౌనంగా ఉండిపోయాయి. ఇక పర్షియన్ గల్ఫ్ పేరును గల్ఫ్ ఆఫ్ అరేబియాగా మారుస్తామని తొలి ఏలుబడిలో 2017లో ప్రకటించారు. దాంతో అప్పటి



ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ జాగ్రఫీ చదువుకోమని ట్రంప్‌కు సలహా ఇచ్చారు. నిరుడు మే నెలలో సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ పర్యటనకెళ్లే ముందు పేరు మార్పు ఉంటుందని ప్రకటించారు. అటు తర్వాత ఎందుకో దాని జోలికి పోలేదు. ఈ 'భౌగోళిక చిత్రపట దురాక్రమణల్ని' చూసి జనం కాలక్షేపానికి నవ్వుకోవచ్చు. ట్రంప్ ప్రదర్శిస్తున్న అమాయకత్వమో, అజ్ఞానమో చూసి జాలిపడే వారూ ఉండొచ్చు. కానీ అగ్ర రాజ్యాల చరిత్ర తెలిసినవారు దాన్నంత తేలిగ్గా వదిలేయరు. ఒక విశాల పాలస్తీనా భూభాగంలోకి కొన్ని దశాబ్దాల్లో భారీయెత్తున యూదుల్ని తరలించి, అక్కడ నరమేధాలకు పాల్పడి ఇజ్రాయెల్‌ను సృష్టించి, అందుకు ఐక్యరాజ్యసమితి ఆమోదాన్ని 'రాబట్టిన' చరిత్ర ఆ దేశాలది. కనుక ఇప్పుడు ఉబుసుపోక మాట్లాడే మాటల్లో వేరే అర్థాలు ఉండొచ్చన్న అనుమానాలు రావటం సహజం. రాజకీయావతారం ఎత్తి దాదాపు పదిహేనేళ్లవుతున్నా పూర్వాశ్రమంలో నిర్వహించిన రియలెస్టేట్ వ్యాపార ప్రభావంనుంచి ట్రంప్ బయటపడలేకపోతున్నారన్నది వాస్తవం. రియలెస్టేట్ యజమాని మాదిరే ఆయన భూదాహంతో అల్లాడిపోతున్నారు. 'మళ్లీ అమెరికాను ఉన్నతంగా చేద్దాం' అనే నినాదం సారాంశం ఖనిజ సంపద పుష్కలంగా ఉండే ప్రాంతాలను అమెరికాలో విలీనం చేసుకోవటమేనన్న సందేశాన్ని ట్రంప్ పంపుతున్నారు. అందుకే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భార్య ఉషా వాన్స్ గ్రీన్‌లాండ్ సందర్శనకెళ్లినప్పుడు డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌ల నుంచి తీవ్ర నిరసనలు ఎదురయ్యాయి. దాంతో చేసేదిలేక ఆమె మధ్యలోనే ఆ పర్యటనను విరమించుకుని వెనక్కిపోవాల్సి వచ్చింది. జనం భావోద్వేగాలు రెచ్చగొట్టి అధికారంలోకొచ్చినవారు వాటిపైనే మనుగడ సాగించాలనుకోవటం సహజం. అలాగైతేనే వారి వైఫల్యాలు మరుగునపడతాయి మరి. ఈ బాపతు నేతలు అందరి దృష్టి తమపైనే ఉండాలన్న తపనతో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటారు. ట్రంప్ దీనికి భూదాహాన్ని కూడా చేర్చారు. ఈ భౌగోళిక చిత్రపటాల్ని చూసిన 'మాగా' జనం నిజంగానే ట్రంప్ వాటిని జయించుకొస్తారన్న భ్రమల్లో ఉంటారు. ఒకపక్క అరేబియా సముద్రంలో లంగరేసిన విమానవాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌లో దుర్భర పరిస్థితులున్నాయనీ, కొందరు ఆత్మహత్యా యత్నం కూడా చేశారనీ వార్తలొస్తున్నాయి. అందులో పనిచేసే రక్షణ సిబ్బందిని వెనక్కు పిలిపించాలని వారి కుటుంబాలనుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. అందుకే చవకబారు చిత్రపట వివాదాలు కట్టిపెట్టి ఇరాన్‌తో సంధికి ప్రయత్నించడం అమెరికా శ్రేయస్సుకు, రాజకీయంగా ట్రంప్‌కు మంచిది.

# తమిఃళ రాజకీయాల్లో సెల్యూట్ ఫీవర్

**చెన్నై :** తమిళనాడు పాలిటిక్స్‌లో పర్సనల్ టార్గెట్స్ సీజన్ నడుస్తోందిప్పుడు. సరిహద్దులు దాటిన రాజకీయ కక్ష్య.. దారి తప్పి వ్యక్తిగత విమర్శల వైపు తిరుగుతోంది. మొన్న విజయ్‌ను టార్గెట్ చేస్తూ బీజేపీ స్టేట్ చీఫ్ నైనార్ నాగేంద్రన్ చేసిన 'అయ్యా.. అమ్మ' వ్యాఖ్యల వివాదం మరువకముందే.. ఇప్పుడు విజయ్-త్రిష సెల్యూట్‌పై డీఎంకే విమర్శలు గుప్పిస్తోంది. మొత్తానికి.. తంబీల రాజకీయం మరీ వ్యక్తిగత విమర్శలవైపు వెళ్తున్నాయి. కోలీవుడ్‌లో ఆ ఇద్దరి కాంబినేషన్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. కానీ, ఈసారి సీన్ మారింది. వేదిక సినిమా థియేటర్ కాదు.. చెన్నైలోని చారిత్రాత్మక సెయింట్ జార్జ్ కోట. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తొలిసారి సీఎం హోదాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. అయితే, ఈ అధికారిక వేడుకల్లో అందరి దృష్టిని ఆకర్షించింది మాత్రం ముందు వరుసలో కూర్చున్న త్రిష కృష్ణన్. పసుపు రంగు చీరలో మెరిసిపోతూ.. వీఐపీ గ్యాలరీలోని ఫ్రంట్ రోలో.. విజయ్ తల్లిదండ్రుల పక్కనే కూర్చుని ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా కనిపించారు త్రిష. సీఎం విజయ్ జాతీయ జెండాను ఎగురవేసిన సమయంలోనూ ఎంతో గౌరవంతో సెల్యూట్ చేశారు. అది కామన్. ఎవరైనా చేసేదే. బట్.. ఆ తర్వాత అధికారిక కార్యక్రమాలను విజయ్ పరిశీలిస్తున్న సమయంలోనూ ఆమె సెల్యూట్ చేస్తూ మొబైల్‌లో ఫొటోలు తీస్తూ కనిపించారు. ఇక పరేడ్ ముగించుకుని సీఎం విజయ్ ముందుకు సాగుతున్న తరుణంలో.. అక్కడ ఉన్న త్రిషకు సెల్యూట్ చేశారు. దానికి అంతే గౌరవంతో త్రిష కూడా సీఎం విజయ్‌కు నవ్వుతూ సెల్యూట్ చేశారు. అంతే.. ఈ ఒక్క క్లాప్ మూడు రోజులుగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో తెగ వైరల్ అవుతోంది. దళపతి ఫ్యాన్స్ ఈ మూమెంట్‌ను ట్రెండ్ చేస్తుంటే.. రాజకీయ వర్గాల్లో మాత్రం ఇది తీవ్ర దుమారానికి దారితీసింది. ఈ వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షం డీఎంకే పత్రిక మురసోలి తీవ్ర విమర్శలు గుప్పించింది. అసలు ఏ అర్హత ఉందని, ఏం హోదా ఉందని త్రిషను ముందు వరుసలో కూర్చోబెట్టారని నిలదీసింది. మురసోలి తన సంపాదకీయంలో ఈ ఘటనను ఒక సిగ్గుచేటు దృశ్యంగా అభివర్ణించింది. ఒక ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ఇలాంటి వ్యవహారం అసలేమాత్రం సముచితం కాదని మండిపడింది. నిజానికి ఈమధ్య కాలంలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో త్రిష హాజరు కావడం పెద్ద చర్చనీయాంశంగా మారుతోంది. మే నెలలో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమానికి కూడా ఆమె హాజరయ్యారు. ఆ వేడుక జరుగుతుండగా త్రిష తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్న వీడియో కూడా అప్పట్లో వైరల్ అయింది. విజయ్, త్రిష చాలా ఏళ్లుగా అత్యంత ఆప్తమిత్రులుగా ఉంటున్నారు. వీరిద్దరి సాన్నిహిత్యంపై తరచూ సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో ఎన్నో ఊహాగానాలు, ప్రచారాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడు మురసోలి పత్రిక సైతం విజయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రచారాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ విమర్శల డోస్ పెంచింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ముఖ్యమంత్రి విజయ్ హోదాకు ఉండాల్సిన గౌరవం గాలిలో కలిసిపోయిందని గట్టిగా విమర్శించింది. ఎలాంటి సంకోచం లేకుండా ఓ నటిని ముందు వరుసలో కూర్చోబెట్టి.. పదేపదే పరస్పరం సెల్యూట్ చేసుకోవడం ఏంటని ప్రశ్నించింది. విజయ్‌కు ఓటు వేసిన వారే ఈ దృశ్యాన్ని జీర్ణించుకోలేకపోయి ఉంటారంటూ మురసోలి చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇప్పుడు తమిళ పాలిటిక్స్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.



# మహిళలకు స్ఫూర్తినిస్తుంది

'అమీర్‌లోగ్' చిత్రంలో తాను పోషించిన పాత్ర మహిళలకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని చెప్పింది కథానాయిక వేదా జలంధర్. హైదరాబాద్ బస్తీ నేపథ్య కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ నెల 21న రానా 'స్పిరిట్' మీడియా ద్వారా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక వేదా జలంధర్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపిస్తానని, ముక్కసూటిగా మాట్లాడటం తన నైజమని చెప్పింది. 'ఈ సినిమా రిలీజైన తర్వాత ప్రతీ ఒక్కరూ నా పాత్ర గురించి మాట్లాడుతారు. హైదరాబాద్ నేటివిటీని ప్రతిబింబించే అద్భుతమైన కథ ఇది. ప్రతీ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఆరేళ్లయింది. 'అమీర్‌లోగ్' తప్పకుండా నా కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందనే నమ్మకం ఉంది' అని వేదా జలంధర్ తెలిపింది

# మోడ్రన్ మిస్సమ్మ కథ



హర్ష నర్రా, తన్మయి, ఖుషి, సిజు ఏఆర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మోడ్రన్ మిస్సమ్మ'. సాయిబాబా దర్శకుడు. లాస్య అండ్ మిథున క్రియేషన్స్ తెరకెక్కిస్తున్నాయి. బుధవారం ఈ సినిమాలోని 'బెటర్ బీ ఏ మిస్సమ్మ' అనే తొలిపాటను విడుదల చేశారు. గోపీ సుందర్ స్వరపరచిన ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రచించారు. 'కథపై నమ్మకంతో ఈ సినిమాకు 'మోడ్రన్ మిస్సమ్మ' అనే టైటిల్ పెట్టాం. పెళ్లి నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమిది. వినోదానికి పెద్దపీట వేశాం' అని దర్శకుడు తెలిపారు. నేటి ట్రెండ్‌కు తగిన సినిమా ఇదని నిర్మాత చిరంజీవి పమిడి పేర్కొన్నారు.కొ





# అక్కినేని త్రయం అదరగొట్టే లుక్స్..

## 'వెరైటీ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై నాగ్, చైతూ, అఖిల్!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం (అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్) తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. అతి త్వరలో రాబోయే ఈ ప్రత్యేక సంచిక కోసం అక్కినేని హీరోలు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో వారు సినిమా రంగంలో తమ కుటుంబం సాధించిన అరుదైన విజయాలు, తొమ్మిది దశాబ్దాల సినీ ప్రయాణం, నాటి అనుభవాలు మరియు నేటి తరానికి సంబంధించిన ఆసక్తికరమైన విశేషాలను పంచుకున్నారు. అత్యంత ఆకర్షణీయమైన దుస్తుల్లో, స్టైలిష్ అప్పియరెన్స్‌తో ఉన్న ఈ అక్కినేని హీరోల ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# వెంకటేశ్-కల్యాణ్‌రామ్ మూవీకి క్రేజీ టైటిల్.. 'జనవరి 12 విడుదల'

అనిల్ రావిపూడి ప్రమోషన్స్ అంటే మామూలుగా ఉండవు..తన సినిమాల ప్రచారంలోనూ కొత్తదనం చూపించే ఆయన.. తాజాగా మరోసారి తనదైన స్టైల్‌లో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కీలక పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమాకు టైటిల్ ప్రకటించే విషయంలోనూ ఓ ఫన్నీ ఐడియాను తీసుకొచ్చారు. టైటిల్‌తో పాటు సినిమా విడుదల తేదీని కూడా ఒకేసారి రివీల్ చేసి ఆసక్తి పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ బావా బామ్మర్ది పాత్రల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా చిత్రబృందం సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించింది. 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసింది. అంతేకాదు.. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే క్యాప్షన్‌ను కూడా జత చేసింది. టైటిల్ వినగానే ఇది సినిమా విడుదల తేదీ అనుకుంటే.. అదే సినిమా పేరుగా ఉండటం విశేషం. టైటిల్ ప్రకటన కోసం రూపొందించిన వీడియోలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి.. అనిల్ రావిపూడిని సినిమా పేరేంటని అడుగుతారు. అందుకు ఆయన పదే పదే 'జనవరి 12 విడుదల' అని చెబుతుంటారు. తొలుత అది రిలీజ్ డేట్ అని భావించిన హీరోలు.. చివర్లో అదే సినిమా టైటిల్ అని తెలుసుకుని సరదాగా స్పందిస్తారు. టైటిల్ రివీల్ వీడియోలో దర్శకుడు అనిల్ రావిపూడి ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు ప్రత్యేకంగా నివాళి అర్పించారు. ఈవీవీ తెరకెక్కించిన 'అప్పుల అప్పారావు'లోని కామెడీ సీక్వెన్స్‌ను గుర్తు చేసేలా వీడియోను రూపొందించారు. ఇలా తన కామెడీ మార్క్‌తో పాటు పాత తరం హాస్యాన్ని కలిపి టైటిల్ అనౌన్స్‌మెంట్‌ను కూడా ఓ ఎంటర్‌టైనింగ్ వీడియోగా మార్చారు.




Edited Printed Published & Owned by Embeti Kameswari. And Printed at VSR Publishers and Printers, #1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh.
Published at VSR Publications, 1-176, Vakadu Village and Post, Vakadu Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR Embeti Kameswari, PRGI. NO. APTEL/26/A2367